
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



వికారాబాద్

గురువారం 24 ఆగస్టు 2017 | 20

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో మరోమార్పు చోటుచేసుకోనుంది. నగదుర హిత లావాదేవీలను ప్రోత్సహించేందుకు మరోఅడుగు పడనుంది. ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు చెల్లించే కూలి (డబ్బు)ను ఇక నుంచి బ్యాంకుల ద్వారానే చెల్లించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. కూలీల నుంచి బ్యాంకు ఖాతా నంబర్లు తీసుకుని, వాటికి ఆధార్‌తో అనుసంధానం చేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు క్షేత్ర స్థాయిలో కూలీల బ్యాంకుఖాతా, ఆధార్ కార్డు నంబర్ సేకరణ ప్రక్రియ కొనసాగుతోంది.



బ్యాంకు ఖాతాల్లోకే ఉపాధి కూలి



వార్త 7లో..

- ఉపాధి కార్డులకు ఆధార్‌తో అనుసంధానానికి చర్యలు..
- సెప్టెంబర్ 10 నుంచి ప్రక్రియ ప్రారంభం
- పోస్టాఫీస్ ద్వారా చెల్లింపునకు స్వస్తి
- జిల్లాలో 4 లక్షల 266 మంది కూలీలు
- నూతన విధానంతో ఆందోళనలో కూలీలు
- ఆధార్ నెంబర్ల సేకరణ క్షేత్ర సహాయకులదే..

రహదారికి మోక్షం..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



నాడు

ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి రోడ్డుకు మోక్షం కలిగింది. ఈ మార్గంలో పడిన గుంతలపై 'రహదారిద్ర్యం' అనే శీర్షికన జిల్లా ఎడిషన్‌లో 15న ప్రచురితమైన కథనానికి బల్దియా అధికారులు స్పందించారు. రోడ్డుపై పడిన గుంతలను బీటీ మెటల్ వేసి పూడ్చివేశారు.



నేడు

రూ.2 కోట్లతో..

జిల్లా ఆసుపత్రికి మరమ్మతు

- కార్పొరేట్ ఆసుపత్రిని తలపించేలా ఆధునికీకరణ
- డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరిస్తాం
- ఆస్పత్రిలో త్వరలోనే బ్లడ్‌బ్యాంకు
- దవాఖానను పరిశీలించిన కలెక్టర్ దివ్య

వివరాలు 8లో..



ఆసుపత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ దివ్య

బస్సుకోసం రాస్తారోకో



రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు

- హాస్టళ్ల వద్ద బస్సులు ఆపాలని రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు
- బస్సు అద్దాల ధ్వంసం..
- డీఎం హామీతో ధర్నా విరమణ

7

కొండెక్కిన 'ఉల్లి'

- నింగినంటిన ఉల్లి ధరలు, కిలో ధర రూ.50
- రానున్న రోజుల్లో రూ.100కు చేరుకునే అవకాశం
- కూరగాయల ధరలకు రెక్కలు
- ఆందోళనలో పేద, మధ్య తరగతి కుటుంబాలు



ఉల్లి కన్నీళ్లు తెప్పిస్తోంది. ఆకాశాన్నంటిన ధరలతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చుక్కలు చూపిస్తోంది. నిన్నమొన్నటి వరకు కిలో రూ.5 నుంచి రూ.10 వరకు ఉన్న ధర ఒక్కసారిగా రూ.50కి పెరగడంతో సామాన్య ప్రజానీకం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా కురగాయల ధరలకూ రెక్కలొచ్చాయి. పెరుగుతున్న ధరలను ముందే పసిగట్టిన వ్యాపారులు కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు. దీంతో సామాన్యుల జేబు గుల్లవుతోంది.

వివరాలు 7లో..

ఆంధ్రజ్యోతి / ఇంటర్వ్యూ

హోటళ్లలో కల్తీపై నజర్

- సరుకుల కల్తీని అరికట్టేందుకు చర్యలు
- ఫిర్యాదులపై వెంటనే స్పందించిన అధికారులు
- ఇప్పటి వరకు 31కేసులు నమోదు
- రూ.1.34లక్షల వరకు జరిమానా
- ఫుడ్‌సేఫ్టీ శాఖ అధికారి అశోక్



కీసరరూరల్: మేడ్చల్- మల్కాజ్ గిరి జిల్లా వైశాల్యంలో చిన్నదైనప్పటికీ జనసాంద్రతలో అధికం. నగరశివారు ప్రాంతాల్లో పెద్దఎత్తున పరిశ్రమలు ఏర్పాటుచేశారు. నగారానికి చేరువలో ఉండడంతో జీవనోపాధి పొందడానికి వివిధ రకాల పనులు నిర్వహించడానికి రాష్ట్రంలోని నలుమూలలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు విచ్చేసి నివాసం ఉంటున్నారు. నిత్యం తమ కార్యకలాపాల్లో నిమగ్నమై, సమయానికి దొరకకపోవడంతో ఇంటి భోజనం కంటే కూడా, అందుబాటులో ఉన్న హోటళ్లు, రెస్టారెంట్లపై ఆధారపడుతున్నారు. ఇదే అదనుగా భావించిన హోటళ్ల నిర్వాహకులు నాసిరకమైన, నిల్వ ఉన్న ఆహార పదార్థాలను వినియోగదారులకు అంటగడుతున్నారు. అదేవిధంగా ధనార్జనే ధ్యేయంగా నిత్యావసరాల సరుకులను కల్తీ చేసి వినియోగదారులకు అమ్మి దండిగా డబ్బులు దండుకుంటున్నారు. వీటన్నింటినీ అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. మేడ్చల్- మల్కాజ్ గిరి జిల్లాలో చేపట్టిన పలు కార్యక్రమాలపై జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి అశోక్ 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లోని హోటళ్లలో, దాబాల్లో, రెస్టారెంట్లలో నాణ్యమైన ఆహారాన్ని అందించడంలేదు. పాడైన ఆహారాన్ని భుజించి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న, ప్రమాణాలు పాటించని హోటళ్లల్లో విక్రయిస్తున్న తినుబండారాలు తినడంతో జనాలు ఆసుపత్రుల పాలవుతున్నారు. జిల్లాలో నాసిరకమైన ఆహారాన్ని, సరుకుల కల్తీని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పలు హోటళ్లలో నిల్వ ఉంచిన ఆహారాన్ని విక్రయిస్తున్నారని ప్రజలు తరచూ ఫిర్యాదులు చేస్తున్నారు. అందులో భాగంగా జిల్లాలోని తినుబండారాలు అమ్మే హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలు, స్వీట్‌హౌస్‌లు, రోడ్డు పక్కన ఏర్పాటయ్యే చిన్నపాటి హోటళ్లను తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నాం. నాసిరకమైన, నిల్వ ఉన్న ఆహారాన్ని వినియోగదారులకు అందించని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటున్నాం. తనిఖీల్లో సేకరించిన నమూనాలను పరిశోధనకు పంపించడం జరుగుతుంది. పరీక్షల్లో ఆరోగ్యానికి హానికరమని తేలిన పక్షంలో వారిపై కేసులు నమోదు చేస్తాం. ప్రభుత్వం సూచించిన ప్రమాణాల ప్రకారం లేనిచో వారిని జిల్లా ఉప పాలనాధికారి(జాయింట్ కలెక్టర్) ఆధ్వర్యంలో విచారించి, జరిమానా విదించడం జరుగుతుంది. జిల్లాలో జనవరి నుంచి జూలై వరకు 31 కేసులు నమోదు చేసి రూ.1.34లక్షలు జరిమానా విధించి, వసూలు చేయడం జరిగింది. నిత్యావసర సరుకులు కల్తీ చేసేవరిపై ఎల్లప్పుడు నిఘా ఉంటుంది.

వారిపై కూడా చట్టరీత్యా చర్యలు తీసుకోడం జరు గుతుంది. తక్కువ ధరకు లభిస్తుందని నాసిరకం సరుకులను కొనుగోలు చేయకూడదు. నాణ్యతా ప్రమాణాలు పాటించి, కట్టుదిట్టంగా ప్యాకింగ్ చేసిన వస్తువులనే కొనుగోలు చేయాలి. ఏవిధమైన ప్యాకింగ్, తయారైన, ఎక్స్‌పైరీ తేదీలు లేని వస్తువులను కొనరాదు.

కంప్యూటర్ విద్య మిథ్యేనా.?

- కంప్యూటర్లు ఉన్న బోధకులు లేక నిరుత్సాహంలో విద్యార్థులు
- ఏ పాఠశాలలో చూసినా మూలన పడిన కంప్యూటర్లు

ఫోకస్



కులకచర్ల బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో వృథాగా ఉన్న కంప్యూటర్లు

కులకచర్ల: ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించాలన్న ఉద్దేశ్యంతో 2008లో అప్పటి ప్రభుత్వం కంప్యూటర్ విద్యా బోధన ప్రవేశ పెట్టింది. ఈ మేరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సాంకేతిక విద్యను అందించేందుకు కంప్యూటర్లు ఏర్పాటు చేసింది. ఒక్కో పాఠశాలకు రూ.లక్ష వెచ్చించి సౌకర్యాలు సమకూర్చారు. ప్రైవేట్ పాఠశాలల కంటే మెరుగ్గా విద్యార్థులకు ఉచితంగా సాంకేతిక విద్యా బోధన చేయాలని నిర్ణయించింది. దీంతో అప్పట్లో తల్లిదండ్రులు ఎంతో సంతోష పడ్డారు. ప్రస్తుతం బోధన చేసే ఉపాధాయులు లేకపోవడంతో కంప్యూటర్ బోధన విద్యార్థులకు దూరమైంది. బోధనా సిబ్బంది లేక, పట్టించుకునే వారు కరువై కంప్యూటర్‌లు దుమ్ముపట్టి పోతున్నాయి. భవిష్యత్‌లో ప్రతి విద్యార్థికి ఏదో రకంగా కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరిగా అవసరం కావడంతో పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించాలని ప్రభుత్వ ఉద్దేశ్యం.

బోధించే వారు లేక..

మండల పరిధిలోని కులకచర్ల బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు చౌడాపూర్, మందిపాల్, ముజాహిత్‌పూర్, పుట్టపహాడ్, బండవెల్కిచర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలకు కంప్యూటర్‌లు అందజేశారు. అవి నేడు ఉపయోగంలో లేక వృథాగా ఉన్నాయి. ఇవే కాకుండా జిల్లాలోని 18 మండలాల్లోని 170 ఉన్నత పాఠశాలల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో గతంలో కాంట్రాక్ట్ బోధకులను నియమించారు. వారి గడువు ముగియడంతో శిక్షణ ఇచ్చేవారు లేకుండా పోయారు. కొత్తగా కంప్యూటర్ విద్య కోసం శిక్షకులను నియమిస్తేనే విద్యార్థులకు పాఠశాల స్థాయిలోనే కంప్యూటర్ విద్య అందే అవకాశం ఉంది. అయితే ఇప్పటి వరకు ఆ ఊసే లేకపోవడంతో కంప్యూటర్ విద్య మిథ్యగానే మిగిలిపోయిందని వాపోతున్నారు.



నిరుత్సాహంలో విద్యార్థులు

ప్రభుత్వం 9 సంవత్సరాల క్రితం ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్‌లను ఏర్పాటు చేసింది. సంబంధిత ఫర్నిచర్, జనరేటర్లను అప్పట్లో పంపిణీ చేశారు. విద్యార్థులకు కంప్యూటర్ విద్యపై శిక్షణ ఇచ్చేందుకు ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా శిక్షకులను నియమించారు. 2013లో శిక్షణ ఇచ్చేవారి ఒప్పంద గడువు ముగియడంతో పాఠశాలల్లో కంప్యూటర్ సామగ్రి మూలన పడ్డాయి. దీంతో కంప్యూటర్ తరగతులు చెప్పకపోవడంతో విద్యార్థులు నిరుత్సాహ పడుతున్నారు. అధికారులు స్పందించి శిక్షకులను నియమించి కంప్యూటర్ విద్యను అందించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఈ విద్యా సంవత్సరంలోనైనా..

ప్రస్తుత ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడిచింది. ఇప్పటి వరకు కంప్యూటర్ బోధకులను నియమించలేదు. నూతన జిల్లాల ఏర్పాటు సందర్భంలోనైనా ప్రతి పాఠశాలకు ఒక కంప్యూటర్ బోధకుడిని నియమిస్తే కొంత వరకైనా లక్ష్యం నెరవేరే అవకాశం ఉంది. ఇప్పటికే కంప్యూటర్లన్నీ దుమ్ము, ధూళి మధ్య అధ్వానంగా మారాయి.

నేర్పించే వారు లేరు



మాకు కంప్యూటర్ నేర్చుకోవాలని ఉంది. కానీ నేర్పించేవారు లేరు. మా పాఠశాలలో కుట్టు శిక్షణ ఇస్తున్నారు. అలాగే కంప్యూటర్ శిక్షణ ఇస్తే మాకు అవగాహన ఏర్పడుతుంది. ప్రస్తుతం పాఠశాలలో కంప్యూటర్లు వృదాగా దుమ్ము, దూళి పట్టి ఉన్నాయి. వాటిని వినియోగంలోకి తేవాలి.

- అమృత 9వ తరగతి, బాలికల ఉన్నత పాఠశాల కులకచర్ల

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పాఠశాలలో కంప్యూటర్ శిక్షకులు లేక వృథాగా ఉన్నాయి. కంప్యూటర్ శిక్షకులను నియమించాలని అధికారులకు తెలిపాం. కంప్యూటర్ నేర్చుకునేందుకు విద్యార్థులు ఆసక్తితో ఉన్నారు. ఎస్‌ఎంసీ కమిటీతో చర్చించి ప్రైవేట్ శిక్షకులను నియమించేందుకు ప్రయత్నిస్తున్నాం.

- వెంకటయ్య, హెచ్‌ఎం బాలికల ఉన్నత పాఠశాల, కులకచర్ల

ఉపాధ్యాయులకు కంప్యూటర్ శిక్షణ



కంప్యూటర్ విద్యను అందించేందుకు ప్రత్యేకంగా బోధన ఉపాధ్యాయుల నియామకాలు జరుగలేదు. పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయుల్లో ఒకరికి శిక్షణ ఇచ్చి కంప్యూటర్ విద్యా బాధ్యతలు అప్పగించేందుకు విద్యా శాఖ అధికారులు యోచిస్తున్నారు. త్వరలోనే విద్యార్థులకు కంప్యూటర్ విద్యతో పాటు డిజిటల్ విద్య అందుబాటులోకి వస్తుంది.

- అబీబ్‌హైమద్ ఎంఈవో

సర్వదోష నివారకుడు గరుత్మంతుడు

షాద్‌నగర్: వేదస్వరూపుడైన గరుత్మంతుడిని భక్తితో పూజిస్తే సర్వదోష నివారణ చేకూరుతుందని షాద్‌నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయ పూజారి శ్రీనివాసచార్యులు పేర్కొన్నారు. షాద్‌నగర్ పట్టణ ముఖద్వారంగా వెలిసి, భక్తుల పాలిట కొంగుబంగారంగా వెలుగొందుతున్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం ఎదుట 11 ఫీట్ల ఎత్తులో ఏకశిల విగ్రహంగా గరుత్మంతుడు వెలిశాడు. పరమటి దిశగా ఉన్న ఆలయ ముఖద్వారం వైపు గరుత్మంతుడు, తూర్పు దిశగా ఆంజనేయస్వామి విగ్రహాలను ఏకశిలకు చెక్కించి ప్రతిష్టించారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు కృషితో ప్రతిష్టించబడిన గరుత్మంతుడికి ఆలయ బ్రహ్మోత్సవాలు, గరుఢ పంచమి రోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. విష్ణువు దర్శనానికి వచ్చే భక్తులు ముందుగా సర్పరాజులనే ఆభరణాలుగా ధరించిన వేదమూర్తి గరుత్మంతుడిని దర్శించుకోవాలి. భక్తితో పూజిస్తే సర్వదోష నివారణతో పాటు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని శ్రీనివాసచార్యులు తెలిపారు.



శ్రీనివాసచార్యులు, ఆలయ పూజారి



కొలువుతీరిన గరుత్మంతుడు

కొత్త జిల్లాల వారీగానే ఉద్యోగ నియామకాలు జరగాలి

- జిల్లా గెజిటేడ్ ప్రధానోపాధ్యాయ సంఘం ప్రధానకార్యదర్శి గిరిధర్

ఉద్యోగపర్వం

షాద్‌నగర్: వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, పరిపాలన సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన కొత్త జిల్లాల వారిగానే ఉద్యోగ నియమకాలు జరగాలి. ప్రభుత్వం పాత జిల్లాల వారిగా ఉద్యోగ నియమకాల కోసం నోటిఫికేషన్లను ఇస్తామనడం సరికాదు. వెనుకబడిన ఉభయ పాలమూరు జిల్లా ప్రాంతం ఆరు జిల్లాల పరిధిలోకి మారింది. షాద్‌నగర్ ప్రాంతం రంగారెడ్డి జిల్లాలోకి మారింది. పాత జిల్లాల వారిగా ఉద్యోగ నియామకాలను కొనసాగిస్తే షాద్‌నగర్ ప్రాంత వాసి, పాత పాలమూరు జిల్లాలో స్థానికుడు ఎలా అవుతాడు. పాత జిల్లాల వారిగా ఉద్యోగ నియమకాలు జరిగితే మారుమూల ప్రాంత జిల్లాల్లో పనిచేయడానికి ఏ ఒక్కరు ఇష్టపడరు. అక్కడున్న ఖాళీలు అలాగే మిగిలిపోతాయి. అలాగే ఖాళీల భర్తీలోనూ... ఆ తరువాత పదోన్నతుల్లోనూ న్యాయపరమైన సమస్యలు తలెత్తుతాయి. ఉద్యోగ నియామకాలకు సైతం న్యాయపరమైన చిక్కులు ఎదురవుతాయి. ప్రభుత్వం పునరాలోచించి, కొత్త జిల్లాల వారిగానే ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్లను ఇవ్వాలి.



పిల్లలకు పురుగుల అన్నం పెడతారా ?

● వార్డెన్‌పై చర్యలు తప్పవు...
● ఆశ్రమ పాఠశాలను ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

మర్పల్లి : ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు పురుగుల అన్నం, కుళ్లిన కూరగాయలతో భోజనం పెడతారా అంటూ వికారాబాద్ ఎమ్మెల్యే సంజీవరావు సిబ్బందిపై మండిపడ్డారు. బుధవారం మండల కేంద్రంలోని ఎస్టీ ఆశ్రమ పాఠశాలను ఆయన స్థానిక నాయకులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా వార్డెన్ గదిలోకి వెళ్లి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎంత మంది విద్యార్థులు ఉన్నారు ? ఉపాధ్యాయులు ఎంత మంది ? వార్డెన్ ఎక్కడ అని సిబ్బందిని ప్రశ్నించారు. వార్డెన్ మీటింగ్ నిమిత్తం వికారాబాద్ వెళ్లారనీ, ఆరుగురు ఉపాధ్యాయులు ఉన్నారని సిబ్బంది సమాధానం ఇచ్చారు. రికార్డులు పరిశీలిస్తున్న సమయంలో కుళ్లిన దుర్వాసన రావడంతో ఎమ్మెల్యే స్టోర్ రూమ్‌కు వెళ్లి పరిశీలించారు. అక్కడ పాడైన గుడ్లు, కుళ్లిన కూరగాయాలు, చిందరవందరగా పడి ఉన్న బియ్యాన్ని చూసి ఆయన సిబ్బందిపై మండిపడ్డారు. విద్యార్థులకు ఈ కూరగాయాలతో భోజనం పెడితే ఆరోగ్యం ఏమవుతుందని ప్రశ్నించారు. అనంతరం మూడు నుంచి పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఆశ్రమ పాఠశాలలో


కూరగాయలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరావు, నాయకులు

200 పైచిలుకు విద్యార్థులు ఉండాల్సి ఉండగా, మూడో తరగతిలో 9 మంది, నాలుగులో 10 మంది, అయిదులో 5 మంది, ఆరులో 13 మంది, ఏడులో 12 మంది, ఎనిమిదిలో 12 మంది, తొమ్మిదిలో 17 మంది, పదిలో 21 మంది విద్యార్థులు ఉన్నారు. మిగతా విద్యార్థులు ఎక్కడా అని ఆయన సిబ్బందిని ప్రశ్నించారు. పేద విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుంటే ప్రతినెల వేతనాలు తీసుకుంటూ ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన మండిపడ్డారు. పాఠశాలలో సమస్యలు ఏమైన ఉన్నాయా అని విద్యార్థులను అడగగా, మూడు నాలుగు రోజుల నుంచి కేవలం పప్పు, కూరగాయలు పెడుతున్నారని విద్యార్థులు సమాధానం ఇచ్చారు. పండ్లు, గుడ్లు ఇవ్వడం లేదని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అన్నంలో పురుగులు వస్తున్నాయనీ, కుళ్లిపోయిన కూరగాయలతో భోజనం పెడుతున్నారనీ ఎమ్మెల్యేకు వివరించారు. టేబుల్ డ్రాలో మద్యం సీసా లభించడంతో వార్డెన్ పనిపై, విద్యార్థుల పట్ల తీసుకున్న జాగ్రత్తలు ఏమిటో తమకు తెలుస్తుందని, ఇలాంటి వార్డెన్ పట్ల కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. వెంటనే సంబంధిత జిల్లా అధికారులతో మాట్లాడి ఎస్టీ ఆశ్రమ పాఠశాలను వెంటనే తనిఖీ చేసి వార్డెన్‌ను తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. చర్యలు చేపట్టకపోతే వీరి పనితీరు పట్ల స్వయంగా తానే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతాననీ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారిని ఫోన్లో హెచ్చరించారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండల్‌రెడ్డి, ఎంపీపీ సుమిత్రమ్మ, జడ్పీటీసీ శోభారాణి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్, పార్టీ మండల అధ్యక్షుడు సురేష్, నాయకులు యాదయ్య, రవి పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దివ్య

ప్రభుత్వ పనులకు ఇసుకను సమకూర్చాలి

సమీక్షలో కలెక్టర్ దివ్య

వికారాబాద్ అర్బన్ : ప్రభుత్వం చేపట్టే నిర్మాణాలకు అవసరమైన ఇసుకను సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ దివ్య అన్నారు. బుధవారం కలెక్టరేటులోని ఛాంబర్‌లో ప్రభుత్వం చేపట్టే నిర్మాణాలకు అవసరమైన ఇసుకపై ఆయా శాఖల ఇంజనీర్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నిబంధనల మేరకు నిర్మాణాలకు అవసరమైన ఇసుకను సరఫరా చేసేందుకు వీలుగా ఎంత ఇసుక అవసరమో ప్రతిపాదనలు సంబంధిత తహసీల్దార్లకు సమర్పించాలన్నారు. ఇసుక సరఫరాకు గనుల శాఖ ఏడీ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని ఆమె తెలిపారు. నిర్మాణాలు చేపట్టే వాటికి 6 నెలలకు అవసరమయ్యే ఇసుక వివరాలను 20 రోజుల ముందుగానే ప్రతిపాదనలు అందజేయాలని ఆమె సూచించారు. ఇసుక కొనుగోలుకు సంబంధించి కావాల్సిన అంచనాలు, కాంట్రాక్టర్ అగ్రిమెంట్, డిమాండ్ డ్రాఫ్ట్ మొదలగు వాటిని జతచేసి సమర్పించినట్లయితే ఇసుకను సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ఇసుక కొరతతో ఎటువంటి పనులు ఆగిపోకుండా చూడాలని పేర్కొన్నారు. ఇసుక సరిపడనట్లయితే ఇతర జిల్లాల నుంచి కొనుగోలుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమీక్షలో పంచాయతీరాజ్ అధికారి మనోహర్‌రావు, ఆర్ అండ్ బీ ఈఈ బి.కె.ప్రతాప్, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి, ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల రెగ్యులరైజేషన్ సాధనలో టీఈఈ విజయం

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పద్మారెడ్డి


మాట్లాడుతున్న పద్మారెడ్డి

అనంతగిరి : కాంట్రాక్టు కార్మికుల రెగ్యులరైజేషన్ సాధనలో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 1104 విజయం సాధించిందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పద్మారెడ్డి అన్నారు. బుధవారం వికారాబాద్‌లోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో సంఘం సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, విద్యుత్‌శాఖలో ఎన్నికలు జరగకుండా కొన్ని సంఘాలు అడ్డుపడుతున్నాయన్నారు. కేవలం ఓడిపోతామన్న భయంతోనే ఆ సంఘాలు ఎన్నికలు జరగకుండా అడ్డుపడుతున్నాయని చెప్పారు. తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్‌కు 70 సంవత్సరాలు చరిత్ర ఉందని తెలిపారు. తమ పోరాటంతో వల్లే ఎన్నికలు జరిపేందుకు యాజమాన్యం ముందుకు వచ్చిందన్నారు. సెప్టెంబర్ మొదటి వారంలో ఎన్నికలు జరగనున్నాయని చెప్పారు. తమ సంఘం ఏ పార్టీకి అనుబంధంగా లేదని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1700 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. ఈపీఎఫ్, జీపీఎఫ్ కోసం సంఘం ఉద్యమం చేపట్టనుందని వివరించారు. ప్రభుత్వం వెంటనే విద్యుత్ శాఖలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతీ ఊరికి ఒక లైన్‌మెన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. పాత పింఛన్ విధానం కోసం సెప్టెంబర్ ఒకటిన నిర్వహిస్తున్న సెలవు దినానికి తమ సంఘం మద్దతు పలుకుతుందన్నారు. కార్మికులు తమ ఓటును టీఈఈ సంఘానికి వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి సాయిబాబు, వేణు, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

26న బెస్ట్ అవైలబుల్ ఎంపిక డ్రా

వికారాబాద్ అర్బన్ : 2017-18 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ (డేస్కాలర్) పాఠశాలలో దరఖాస్తు చేసుకున్న బాల, బాలికల ఎంపికను డ్రా పద్ధతిన నిర్ణయించడం జరుగుతుందని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కె.హన్మంత్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు డ్రా తీసి అందుకు సంబంధించిన వివరాలు వెల్లడించడం జరుగుతుందని పేర్కొన్నారు.

అక్రమంగా పశువులను తరలిస్తున్న వ్యక్తిపై కేసు

అనంతగిరి : పశువులను అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేసిన సంఘటన వికారాబాద్ పట్టణంలో బుధవారం జరిగింది. ఎస్ఐ సురేష్ తెలిపిన ప్రకారం... వికారాబాద్ పట్టణ పరిధిలోని శివారెడ్డిపేట్‌కు చెందిన మహ్మద్ మోయినొద్దీన్ ధారూరు మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి పశువులను కొనుగోలు చేసి వాహనంలో తరలిస్తున్నాడు. వికారాబాద్‌లోని ఎన్కెపల్లి చౌరస్తా వద్ద పోలీసులు వాహనాన్ని పట్టుకుని వికారాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పశువులను తరలిస్తున్న వ్యాన్ పట్టివేత

బషీరాబాద్ : పశువులను తరలిస్తుండగా పోలీసులు వాహనాన్ని పట్టుకున్నారు. ఈ సంఘటన బషీరాబాద్ మండలం మైల్వార్ గ్రామం చెక్‌పోస్టు వద్ద మంగళవారం మధ్యాహ్నం జరిగింది. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.... కర్ణాటక రాష్ట్రం నుంచి వ్యాన్‌లో 12 లేగ దూడలు తీసుకొస్తుండగా, సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నారు. వ్యాన్‌లో 9 దూడలు ఉండగా గ్రామంలో సర్పంచ్‌కు అప్పగించి వాహనాన్ని పోలీసు స్టేషన్‌కు తరలించారు. వ్యాన్‌లోఉన్న వారిని విచారించగా, బక్రీద్ సందర్భంగా పశువులను తరలిస్తున్నట్లు తేలిందని ఎస్ఐ తెలిపారు. పశువులు ఎక్కడి నుంచి తీసుకువచ్చారనేది స్పష్టత లేదని, కాగితాలు లేవని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



పశువులను తరలిస్తున్న వ్యాన్

అడవి పందులతో మొక్కజొన్న నాశనం

పూడూరు : అడవి పందులు దాడిచేసి రెండెకరాల మొక్కజొన్న పంటను నాశనం చేశాయి. పూడూరు మండల పరిధిలోని మేడిపల్లికలాన్ గ్రామానికి చెందిన రైతు వెంకట్‌రెడ్డికి చెందిన రెండెకరాల మొక్కజొన్న చేలో మంగళవారం రాత్రి అడవిపందులు పడ్డాయి. మొక్కజొన్న దంట్లను ఇష్టంవచ్చినట్లుగా తొక్కడమే కాకుండా ఈని కంకులు పోసుకుంటున్న దంట్లను కొరికి ఎందుకు పనికి రాకుండా చేశాయి. ఇప్పుడిప్పుడే ఈని కంకులు పోసుకుంటున్న చేనంతా పందులు పాడుచేశాయని ఆ రైతు విలపించాడు. అప్పులు చేసి సాగు చేసిన పంటను పందులు పాడు చేయడంతో అప్పులు ఎలా తీర్చాలి అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని అతడు కోరుతున్నాడు.


అడవిపందుల దాడిలో దెబ్బతిన్న పంటను చూసి బోరుమంటున్న రైతు

అమ్మాయిలను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు

డీఎస్పీ స్వామి

వికారాబాద్ అర్బన్ : అమ్మాయిల పట్ల ఎవరైన అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పి టి.స్వామి అన్నారు. బుధవారం విశ్వభారతీ డిగ్రీ కళాశాల సమీపంలో అమ్మాయిలపై ఈవ్‌టీజింగ్ చేస్తున్న ఇద్దరు యువకులను షీటీమ్ బృందం పట్టుకుని డీఎస్పీ ముందు హాజరుపరిచారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఆ యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చి ఇలాంటి చర్యలకు మరోసారి పాల్పడితే తీవ్రమైన పరిణామాలు ఉంటాయని హెచ్చరించి పంపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి చదువుకోవాలన్నారు. అనవసరంగా ఈవ్‌టీజింగ్‌కు పాల్పడి ఇబ్బందులకు గురికాకూడదని ఆయన విద్యార్థులకు సూచించారు. ఏ చిన్న తప్పు చేసినీ షీటీమ్ మీ చుట్టూనే ఉంటుందనీ, తప్పుచేసిన వారు ఎట్టి పరిస్థితుల్లో తప్పించుకునే అవకాశం లేదని ఆయన హెచ్చరించారు. బంగారు భవిషత్‌ను చిన్న కారణాలతో నాశనం చేసుకోవద్దని యువకులకు సూచించారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

పూడూరు : రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. చన్‌గోముల్ ఎస్ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 20వ తేదీ రాత్రి మన్నెగూడ బస్‌స్టేషన్ ఎదురుగా నడుచుకుంటూ వెళుతున్న గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని స్థానికులు చికిత్స నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరిలించారు. అక్కడ అతడు చికిత్స పొందుతూ 22వ తేదీ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడు ఎవరన్నది ఇంకా తెలియరాలేదు. అతడి వయస్సు 35 ఏళ్లు ఉంటాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

మంతట్టి గ్రామంలో మహిళ...

బషీరాబాద్ : చికిత్స పొందుతూ ఓ మహిళ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు బషీరాబాద్ ఎస్ఐ షర్ఫొద్దీన్ తెలిపారు. బషీరాబాద్ మండలం మంతట్టి గ్రామానికి చెందిన బుడగ జంగం మాణిక్యమ్మ(50)కు కొంత కాలంగా మతిస్థిమితం సరిగా లేదు. ఏడాది కిందట భర్త చనిపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైంది. ఈ క్రమంలో ఈ నెల 19న ఇంట్లో ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహ్యాకు పాల్పడింది. కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం ఆమెను తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది.

మృతురాలి కుమారుడు విశ్వనాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మట్టి వినాయకులను నెలకొల్పి పూజిద్దామని, పర్యావరణాన్ని కాపాడుదామంటూ కులకచర్ల బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు తెలియజేశారు. బుధవారం పాఠశాల ఆవరణంలో మట్టితో వినాయక విగ్రహాలను వారు తయారు చేశారు. తరగతులలో మట్టి వినాయకులను నెలకొల్పి పూజలు చేస్తామన్నారు. వారం రోజుల క్రితం వికారాబాద్‌లో జరిగిన మట్టి వినాయకుల విగ్రహాల తయారీలో పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొని అధికారులతో బహుమతులు పొందారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **- కులకచర్ల**



హరితవనం.. ఆ పాఠశాల

- పచ్చదనంతో కళకళలాడుతున్న
- కులకచర్ల బాలికల ఉన్నత పాఠశాల
- ఆవరణంలో 1000 పైగా టేకు మొక్కలు
- మొక్కల సంరక్షణకు ప్రత్యేక కూలీ

కులకచర్ల: కులకచర్ల బాలికల ఉన్నత పాఠశాల ఆవరణం పచ్చదనంతో కళకళలాడుతుంది. పాఠశాల అంటేనే అజ్ఞానాన్ని తొలిగించి విజ్ఞానాన్ని అందించే ఓ దేవాలయం. అలాంటి బడిని పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ప్రాంగణం అంతా విస్తారంగా మొక్కలు నాటారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయలు వాటి రక్షణే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. గత పది సంవత్సరాల క్రితం పాఠశాల భవనం నిర్మాణ సమయంలో అప్పటి విద్యా కమిటీ చైర్మన్ శివరాజు పాఠశాల ఆవరణంలో దాదాపు 1000 పైగా టేకు మొక్కలు నాటించారు. వాటి సంరక్షణ కోసం ప్రత్యేక కూలిని నియమించారు. అప్పట్లో నియమించిన కూలి చెన్నయ్య ఇప్పటికి కొనసాగుతూ చెట్ల సంరక్షణ చేపడుతున్నాడు. గత రెండు హరితహారం కార్యక్రమాల్లో భాగంగా పాఠశాల ఆవరణంలో 200ల మొక్కలు నాటారు. వాటి సంరక్షణ బాధ్యతలు హెచ్‌ఎం వెంకటయ్య విద్యార్థులకు అప్పగించారు. విద్యార్థులు దత్తతగా తీసుకొని మొక్కల సంరక్షణ చేపడుతున్నారు. ఇప్పుడు పాఠశాల ప్రాంగణం అంతా చెట్లతో ఆహ్లాదకరంగా మారిపోయింది. ప్రతినిత్యం విద్యార్థులు పాఠశాలకు రాగానే వాటి పోషణ బాధ్యతలు చూసుకుంటున్నారు. పాఠశాలకు వచ్చే ప్రముఖులు, విద్యార్థులు చెట్లను చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు సంవత్సరాలైతే హరితహారంలో నాటిన మొక్కలు కూడా ఎదిగి నీడను ఇవ్వనున్నాయి. ప్రతి పాఠశాలలో కూడా మొక్కలు నాటితే అవి భవిష్యత్ తరాలకు ఎంతో మేలు చేకూరుస్తాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు.




కులకచర్ల బాలికల ఉన్నత పాఠశాలలో ఎదిగిన టేకు చెట్లు

ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో...



పాఠశాలలో ప్రతి పనికి ఉపాధ్యాయులు ప్రోత్సాహం ఎంతో ఉంది. పాఠశాల ఆవరణంలో మొక్కలు పెంచుకోవడం అంటే ప్రతి ఒక్కరికి ప్రేమ. ప్రతినిత్యం వాటికి నీరందించి సంరక్షిస్తున్నాం. తోటి విద్యార్థులు కూడా దత్తత తీసుకొని మొక్కలకు నీరందిస్తున్నారు.

- అనిత, విద్యార్థి 8వ తరగతి

మెరుగైన విద్యను అందించాలి: ఎంఈవో

దోమ: ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంఈవో హరిశ్చందర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని బొంపల్లి, కిష్టాపూర్ ఉన్నత పాఠశాలల్లో త్రీఆర్స్‌పై ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, మొదటి విడత త్రీఆర్స్‌పై ఉపాధ్యాయులకు ఇంతకు ముందే శిక్షణ తరగతుల ద్వారా ఆయా సబ్జెక్ట్‌లపై విద్యార్థులకు ఎలా బోధించాలనే దానిపై వివరించామన్నారు. ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు స్పందించి ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హరిలాల్, రామాంజనేయులు, చెర్క సత్తెయ్య, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'రుణాలు చెల్లించి కొత్తవి పొందండి'

కులకచర్ల: తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి కొత్త రుణాలు పొందాలని సెర్ప్ సిబ్బంది తెలిపారు. బుధవారం బండవెల్కిచర్ల గ్రామంలో డ్వాక్రా సంఘాలతో రికవరీ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా సెర్ప్ సిబ్బంది శ్రీనివాస్, గణేష్‌లు మాట్లాడుతూ, స్త్రీనిధి, బ్యాంక్ రుణాలు సకాలంలో చెల్లించి కొత్త రుణాలు పొందాలని సూచించారు. ఈ సందర్భంగా బకాయి పడిన సంఘాల నుంచి డబ్బులు రికవరీ చేశారు.

పీసీల బదిలీలు

కులకచర్ల: కులకచర్ల పీఎస్‌కు చెందిన 7 మంది సిబ్బంది బదిలీ అయ్యారు. బదిలీ అయిన వారిలో ముగ్గురు హెడ్ కానిస్టేబుల్‌లు, నలుగురు కానిస్టేబుల్‌లు ఉన్నారు. హెడ్ కానిస్టేబుల్ అనంతరాములు కొడంగల్ పీఎస్‌కు, జైపాల్‌రెడ్డి దోమ పీఎస్‌కు, పాండు గౌడ్ వికారాబాద్ మహిళ పీఎస్‌కు, కానిస్టేబుళ్లు శ్రీనివాస్ పరిగి, జనార్ధన్‌రెడ్డి పరిగి పీఎస్‌కు, రాఘవేందర్‌గౌడ్ బొంరాస్‌పేట్, వెంకట్ దోమ పీఎస్‌కు బదిలీ అయ్యారు. కొత్తగా దోమ పీఎస్ నుంచి హెడ్ కానిస్టేబుల్ ఉస్మాన్ ఇక్కడికి వచ్చారు. పరందాములు మరో నలుగురు కానిస్టేబుళ్లు కొత్తగా రానున్నారు.

1న సామూహిక సెలవులో పాల్గొనాలి

యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మైపాల్‌రెడ్డి



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

కులకచర్ల: సెప్టెంబరు 1న సామూహిక సెలవులో ఉపాధ్యాయులంతా పాల్గొనాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మైపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం ముజాహిత్‌పూర్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలల్లో సెప్టెంబరు 1 సామూహిక సెలవుకు సంబంధించి పోస్టర్ విడుదల చేసి మాట్లాడారు. ఉపాధ్యాయులంతా సెప్టెంబరు 1న సామూహిక సెలవు ప్రకటించి జిల్లా కేంద్రంలో జరిగే ధర్నాలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో మండల పీఆర్‌టీయూ అధ్యక్షుడు హన్మంత్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కులకచర్ల బాలుర ఉన్నత పాఠశాలలో సెప్టెంబరు 1న సామూహిక సెలవుకు సంబంధించి పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంఈవో అబీబ్‌హైమద్, ఉపాధ్యాయులు రవీందర్ గౌడ్, నర్సింహులుగౌడ్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

దోమ: విద్యార్థులు వ్యాధుల బారిన పడకముందే వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని డాక్టర్ సురేష్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఐలాబాద్ ప్రాథమిక, అంగన్‌వాడీ సెంటర్‌లోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అందులో 6 మందికి ఆయా రోగాలతో బాధ పడుతున్నట్లు గుర్తించారు. వీరిని ఉన్నత వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్త, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి'

పూడూరు: గణేష్ నవరాత్రి ఉత్సవాలను అందరు కలసి మెలసి శాంతియుతంగా జరుపుకోవాలని చన్‌గోముల్ ఎస్‌ఐ బి.ఆంజనేయులు అన్నారు. బుధవారం పూడూరు మండల పరిధిలోని మన్నెగూడ జేకే పంక్షన్‌హాల్‌లో ప్రజాప్రతినిధులు, గణేష్ మండలపాల నిర్వహణ కమిటీలతో పోలీసులు ఆధ్వర్యంలో శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ, గణేష్‌ను ప్రతిష్ఠించేందుకు పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. గణేష్ ప్రతిష్ఠాపన మొదలు నిమజ్జనం వరకు మండప నిర్వాహకులు పాటించాల్సిన నియమాలు, సూచనలు తెలియజేశారు. అదే విధంగా డీజే ఎట్టి పరిస్థితితో అనుమతి ఉండదన్నారు. నిబందనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ మహేష్, టీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు మల్లేషం, అనంతరాములు, సుభానయ్య, సర్పంచ్‌లు దయాకర్, నవీన్‌కుమార్, అశోక్, ఆయా గ్రామాల మండపాల నిర్వహనకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణించిన కులకచర్ల విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కులకచర్ల: రాష్ట్ర స్థాయిలో జరిగిన ఖో-ఖో పోటీల్లో పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించారని కులకచర్ల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపాల్ దేవి తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులను బుధవారం పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు. ఈ నెల 17 నుంచి 20 వరకు హైదరాబాద్ సరూర్‌నగర్‌లో రాష్ట్ర స్థాయి 51వ సీనియర్ ఖో-ఖో బాలికల ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో రాష్ట్ర జట్టు నుంచి పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు అనూష, భారతి, 8వ తరగతి సవితలు పాల్గొన్నారు. వీరు పాల్గొన్న జట్టు రాష్ట్ర స్థాయిలో 3వ బహుమతి సాధించింది. ఈ క్రీడల్లో పాల్గొన్న పాఠశాల విద్యార్థిని అనూష జాతీయ జట్టుకు ఎంపికైంది.

విద్యార్థులకు మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణి చేస్తున్న ఉపాధ్యాయులు

పరిగి: ప్రతి విద్యార్థి తమ ఇళ్ల దగ్గర మొక్కలను నాటి పెంచే బాధ్యతను తీసుకోవాలని చిగురాల్‌పల్లి పాఠశాల ఎస్‌ఎంసి చైర్మన్ సుభాన్ అన్నారు. బుధవారం చిగురాల్‌పల్లి పాఠశాలలోని 120 మంది విద్యార్థులకు జామ, దానిమ్మ, అల్లనేరేడు మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ.కృష్ణ, ఎన్.నర్సింహులు, ఆర్.శ్రీనివాస్, జి.లక్ష్మయ్య, జి.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు...

కులకచర్ల: హరితహారం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని కామునిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు మొక్కలు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ టీచర్ పండరిభాయి మాట్లాడుతూ, తమ ఇంటి పరిసరాల్లో పంపిణీ చేసిన మొక్కలు నాటి పెంచాలన్నారు. తమ పిల్లలతో పాటు ఈ మొక్కలను కూడా పెంచాలన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కులకచర్ల: విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఇప్పాయిపల్లి ఎంపీటీసీ సంధ్యాఆనంద్ తెలిపారు. బుధవారం ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆమె పరిశీలించి ఏజెన్సీ మహిళలతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం మెను ప్రకారం అందించాలన్నారు. గుడ్లు, పండ్లు విధిగా అందజేయాలన్నారు. పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు గుర్తింపు తేవాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పరందాములు, ఎస్‌ఎంసీ చైర్మన్ వెంకటయ్య పాల్గొన్నారు.

నేడు ఉచితంగా మట్టి వినాయకుల పంపిణీ

పరిగి: ఇంటర్నేషనల్ వైశ్యఫెడరేషన్ ఆధ్వర్యంలో పరిగిలో గురువారం ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయడం జరుగుతుందని ఐవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు మలిపెద్ది మేఘమాల తెలిపారు. గణేశ్ విగ్రాహాలను తీసుకెళ్ల వలసిన వారు 9491160704ను సంప్రదించాలని ఆమె సూచించారు.



విద్యార్థులు మట్టి వినాయకులను తయారు చేయడం అభినందనీయమని దోమ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు అనంతయ్య, సహదేవ్ అన్నారు. దోమ బాలురు ఉన్నత పాఠశాల విద్యార్థులు తాము తయారు చేసిన మట్టి వినాయకులను బుధవారం పాఠశాలకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, పాఠశాలకు చెందిన శ్రీకాంత్, ఎండి.ఖయ్యూం ఎంతో చక్కగా మట్టి వినాయకులను తయారు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **- దోమ**

పలు అభివృద్ధి కార్యక్రమాల పరిశీలనతో అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించడంలో భాగంలో గురువారం ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఎండీ.యూసుఫ్, ఎన్.ప్రశాంత్, సంజీవ్‌రెడ్డి, రాజు, హన్మంత్‌రెడ్డి తదితరులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొడంగల్ ప్రభుత్వాసుపత్రిలో నిర్వహించే సమీక్షా సమావేశానికి మధ్యాహ్నం 2 గంటలకు రానున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గురుకుల పాఠశాలలు, కేజీబీవీ, విద్యా సంస్థలు తదితర అధికారులతో ఎమ్మెల్యే స్వగృహంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. - కొడంగల్



సమస్యలు తీరేనా..?

- 30 పడకల ఆసుపత్రికి 3 పడకలే..
- సరిపడాలేని వైద్య సిబ్బంది
- నేడు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం



కొడంగల్ ప్రభుత్వాసుపత్రి

కొడంగల్: పేద ప్రజలకు అందించే వైద్య సేవల్లో తరచూ అంతరాయం ఏర్పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చాలీచాలనీ వైద్య సిబ్బందితో పేద ప్రజలకు సరైన వైద్య సేవలు అందకపోవడంతో ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. నియోజకవర్గ కేంద్రంలో కొనసాగుతున్న 30 పడకల ఆసుపత్రిలో 3 పడకలే అందుబాటులో ఉండటంతో రోగులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తుంది. ఇటీవల ప్రభుత్వం ప్రతి నియోజకవర్గ కేంద్రంలో 100 పడకల ఆసుపత్రిని నిర్మించాలని ఆదేశించినా కొడంగల్‌లో మాత్రం 50 పడకలకే కుదించడం ఈ ప్రాంత ప్రజలకు తీరని ఇబ్బందులను కలిగిస్తుంది. 100 పడకల ఆసుపత్రి ఏర్పాటుతో అన్ని రకాల వైద్య సేవలు అందుతాయని భావించినా అందుకు విరుద్ధంగా పడకలను కుదించి పనులు చేపట్టడం చోటు చేసుకుంటుంది. ప్రస్తుతం 30 పడకల ఆసుపత్రికి సంబంధించిన సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో రోగులకు వైద్యం అందక తాండూర్, మహబూబ్‌నగర్ తదితర ఆసుపత్రులకు రోగులను తరలించడం పరిపాటిగా మారింది. ఇందుకు తోడు ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. రోగులకు అవసరపడే మందులు, సిరంజీలు అందుబాటులో ప్రైవేట్ దుకాణాల వైపు పరుగులు తీస్తున్నారు.

● పరిష్కారం లభించేనా..?

ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది షిఫ్టుల వారీగా విధులు నిర్వహించడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రి వేళ ఏదైనా రోడ్డు ప్రమాదం, ప్రసూతి కోసం, ఇతరాత్ర ప్రమాదాలతో ఆసుపత్రికి వస్తున్న రోగులకు వైద్య సేవలు అందక ఇతర ఆసుపత్రులకు తరలి వెళ్తున్నారు. ఆసుపత్రిలో కనీసం ఆక్సిజన్ లేకపోవడంతో రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన రోగులు మృత్యువాత పడుతున్నారు. 30 పడకల ఆసుపత్రిలో 3 పడకలే అందుబాటులో ఉండటంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. మరో గది ఉన్నా అందులో నూతనంగా ఆసుపత్రి నిర్మాణం చేపడుతున్న సామాగ్రిని వేయడం చోటు చేసుకుంటుంది. ఆసుపత్రిలో కనీసం రోగులకు తాగునీటి వసతిని కల్పించకపోవడంతో హోటళ్ల వైపు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. గురువారం జరిగే ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి పాల్గొని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని ప్రజలు ఆశిస్తున్నారు.


ఏపీవోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పీడీ

'హరితహారంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు'

దౌల్తాబాద్: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరిత హారం కార్యక్రమాన్ని నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఆర్‌డీఓ పీడీ జాన్సన్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిహామీ, ఐకేపీ సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ దౌల్తాబాద్‌లో 20 గ్రామ పంచాయతీల్లో 2 లక్షల 10వేల మొక్కలను నాటితే ఇప్పటి వరకు డబ్బులు ఎందుకు అందించలేదని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఆయా గ్రామాల టెక్నికల్ అసిస్టెంట్‌లతో అడిగి తెలుసుకున్నారు. మస్టర్‌లలో నమోదు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సస్పెండ్ చేస్తామన్నారు. నాటిన ప్రతి మొక్కకు జీయో ట్యాగింగ్‌ను చేయాలని టెక్నికల్ అసిస్టెంట్‌లను ఆదేశించారు. అనంతరం జాబ్ కార్డులు కావాలంటే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటే అందిస్తామన్నారు. ఉపాధిహామీ పథకంలో చేసిన పనుల పురోగతిపై సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో అధికారులు లక్ష్మీ, సుధాకర్‌రెడ్డి, దస్తయ్య, టెక్నికల్ అసిస్టెంట్‌లు వీరేశం, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

కొడంగల్‌రూరల్‌లో...

కొడంగల్‌రూరల్: ఉత్తమ సేవలు అందించడంతో ఆగస్టు 15న రాష్ట్ర స్థాయిలో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా పురస్కారం, ప్రశంస పత్రం పొందిన డీఆర్‌డీఓ పీడీ జాన్సన్‌ను బుధవారం సన్మానించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బొంరాస్‌పేట్, కొడంగల్ మండలాల ఐకేపీ, ఉపాధిహామీ పథకాల సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశానికి పీడీ హాజరు కావడంతో శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు వీరబ్రహ్మాచారి, హరినందన్‌రావు, తహసీల్దార్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్లు పనిచేయక ఖాతాదారుల ఇక్కట్లు


బ్యాంకు దగ్గర వేచి చూస్తున్న ఖాతాదారులు

బొంరాస్‌పేట్: ప్రతి నిత్యం నగదు లావాదేవీలతో ముడిపడిన ఖాతాదారులతో బ్యాంకులకు ఆదివారం సెలవు, మంగళవారం సమ్మె, బుధవారం కంప్యూటర్‌లు పని చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బొంరాస్‌పేట్‌లో గల ఎస్బీఐ ఖాతాదారులు బుధవారం తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గత రెండు రోజులుగా బ్యాంకులకు సెలవు ఉండటంతో నగదు కోసం ఖాతాదారులు బ్యాంకు తెరవకముందే బ్యాంకుకు వచ్చారు. తీరా బ్యాంకు సిబ్బంది బ్యాంకును తెరవగానే కంప్యూటర్‌లు పని చేయడం లేదని నోటిసు బోర్డును తగిలించారు. ఎంతో ఆశతో నగదు కోసం మండలం నలుమూలాల నుంచి వచ్చిన ఖాతాదారులకు ఇబ్బందులు తప్పలేదు. ఇప్పటికైనా బ్యాంకు అధికారులు సాంకేతిక లోపాలతో ఖాతాదారులకు ఇబ్బందులను కలిగించకుండా చూడాలని ఖాతాదారులు కోరుతున్నారు.

'మధ్యాహ్న భోజనాన్ని ఏజెన్సీలకు అప్పగించాలి'

బొంరాస్‌పేట్: మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయ పాత్ర స్వచ్ఛంద సంస్థకు అప్పగించకుండా చూడాలని సీఐటీయూ నేతృత్వంలో మధ్యాహ్న భోజన కార్మికులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. బుధవారం సీఐటీయూ నాయకులు చంద్రయ్య నేతృత్వంలో కార్మికులు పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ రాజేందర్‌రెడ్డికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకాన్ని ఏజెన్సీ మహిళలకు అప్పగించాలన్నారు. కనీస వేతనం రూ.5వేలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు చెన్నమ్మ, పద్మమ్మ, దస్తమ్మ, అంజమ్మ పాల్గొన్నారు.

'మున్నూరు కాపుల విద్యాభివృద్ధికి కృషి'


మాట్లాడుతున్న మున్నూరు కాపు నాయకులు

కొడంగల్: మున్నూర్ కాపు విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం 50 సంవత్సరాలుగా విద్యారంగంలో సేవలు కొనసాగిస్తూ ఉచిత నోటు పుస్తకాలను అందిస్తున్నట్లు సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గంపచంద్రమోహన్ అన్నారు. బుధవారం స్థానిక మున్నూర్ కాపు విద్యార్థులకు నోటు పుస్తకాలను అందించి ఐబీలో విలేఖరులతో మాట్లాడారు. మున్నూర్ కాపు సంఘం 150 మంది పేద విద్యార్థులకు వసతి గృహం నుంచి పుస్తకాలను అందిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 2 గాంధీ జయంతిన పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు మెరిట్ అవార్డులను, నగదు ప్రోత్సాహకం అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సంవత్సరం నుంచి పదో తరగతిలో 9 గ్రేడ్ సాధించిన విద్యార్థులకు విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వివరించారు. మున్నూర్ కాపు విద్యార్థులకు రూ.1 కోటి 50 లక్షలతో వైద్య సేవలను అందించనున్నట్లు తెలిపారు. త్వరలో 5 లక్షల మంది మున్నూర్ కాపు విద్యార్థులతో భారీ బహిరంగ సభను నిర్వహించి సమస్యల సాధనకు పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు వెంకట్రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి జైపాల్‌రెడ్డి, నాయకులు శంకరప్ప, నర్సిరెడ్డి, బాకారంశేఖర్, రమేశ్, ప్రసాద్, ఓంప్రకాశ్, బిచ్చప్ప తదితరులు పాల్గొన్నారు.

'నార్లపూర్‌నుంచి దిండికి నీళ్ల తరలించడం ఆపాలి'

బొంరాస్‌పేట్: నీళ్లు, నిర్వాసితుల కోసం ఈ నెల 19 నుంచి 27 వరకు పాలమూర్ జిల్లా అంతటా జరిగే ప్రచార ఉద్యమంలో భాగంగా 28న నియోజకవర్గ కేంద్రాల్లో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య పిలుపునిచ్చారు. బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ పాలమూర్ పథకంలో భాగంగా నార్లపూర్ నుంచి దిండి పేరుతో నీటిని తరలించే పథకాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. నిర్మాణం చివరి దశలో ఉన్న కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ పథకాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. కృష్ణా నీటిని తిరిగి పంచి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు న్యాయం చేయాలన్నారు. బీమా నీటిలో మక్తల్, భూత్పూర్ రిజర్వాయర్ నుంచి బొంరాస్‌పేట్ వరకు నీరందించే నారాయణపేట్, కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని వెంటనే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీటీసీలు నర్సిములునాయుడు, రాములు, టీడీపీ నాయకులు రాంచంద్రారెడ్డి, సయ్యద్‌మునీర్, పెద్దహన్మయ్య, వెంకటయ్య, రాములు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

'పెన్షన్ విద్రోహ దినాన్ని విజయవంతం చేయాలి'


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

బొంరాస్‌పేట్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు భద్రతను అగమ్యగోచరంగా మార్చిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎస్ యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం చౌదర్‌పల్లి జడ్పీహెచ్ఎస్‌లో సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినాన్ని విజయవంతం చేయాలనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు వెన్నెలసత్యం మాట్లాడుతూ ఉద్యోగ ఫ్రెండ్లీ ప్రభుత్వమని చెప్పుకునే నాయకులు సీపీఎస్ విధానాన్ని అమలు చేస్తామని కేంద్రానికి లేఖ ఇవ్వడం శోచనీయం అన్నారు. కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, రమేశ్‌బాబు, గోపాల్, శ్రీశైలం, బాల్‌రాజ్, మనోహర్, వెంకటయ్య పాల్గొన్నారు.

ఇమ్డాపూర్‌లో రక్తనమూనాల పరిశీలన

దౌల్తాబాద్: రక్తపరీక్షలు చేయించుకోవడంతో ప్రమాదాలు, అత్యవసర సమయాల్లో మరొకరికి రక్తదానం చేసేందుకు అవకాశం ఉంటుందని యంగ్ లీడర్స్ నాయకులు రవినాయక్ తెలిపారు. మండల పరిధిలోని ఇమ్డాపూర్ గ్రామంలో బుధవారం యంగ్ లీడర్స్ ఆధ్వర్యంలో రక్త నమూనా పరీక్షలను నిర్వహించారు. రక్త పరీక్షలతో కలిగే ప్రయోజనాలపై ప్రజలకు వివరించారు.

'నాటిన మొక్కలు సంరక్షించుకోవాలి'

మోమిన్‌పేట : ఇంటింటికి నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకోవాలని మండల టీడీపీ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజు సూచించారు. బుధవారం మండలంలోని పాత కోలుకుంద గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఇంటింటికి మొక్కలను నాటాలని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొక్కలు నాటి పెంచడం వల్ల ప్రతి ఒక్కరికి ప్రయోజనం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సీసీ అంజయ్య, వార్డు సభ్యులు సునీత, నవనీతలు పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న అధికారులు

వినాయక ఉత్సవాలకు సిద్ధం

- మండపాలకు తరలివస్తున్న గణనాథులు
- అమ్మకాలకు సిద్ధంగా విగ్రహాలు
- రూ.2 వేల నుంచి 30 వేల వరకు ధరలు

వికారాబాద్ అర్బన్ : వినాయక నవరాత్రి ఉత్సవాలకు ఊరూవాడ ముస్తాబవుతున్నాయి. వికారాబాద్ పట్టణంలోని 28 వార్డులతోపాటు మండల పరిధిలోని 21 గ్రామ పంచాయతీలు సిద్ధమయ్యాయి. వికారాబాద్ పట్టణంలో సుమారు 100 విగ్రహాల వరకు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అదే విధంగా మండలంలోని అన్ని గ్రామాల్లో రెండు నుంచి నాలుగు విగ్రహాలు పెట్టే అవకాశం కన్పిస్తుంది. ఇందు కోసం వినాయక మండపాల నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

తరలివస్తున్న గణనాథులు

ఇదిలా ఉంటే వికారాబాద్ పట్టణంలో పలు మండపాల్లో వినాయకులను హైదరాబాద్ నుంచి తీసుకువస్తున్నారు. అక్కడి నుంచి వివిధ ఆకారాల్లో ఉన్న పెద్ద పెద్ద గణనాథులను నిర్వాహకులు తీసుకొస్తున్నారు. వికారాబాద్‌లో ఈ సంవత్సరం చాలావరకు హైదరాబాద్ నుంచే తీసుకురావడానికి ఆయా మండపాల నిర్వాహకులు మొగ్గుచూపడం జరుగుతుంది.



అమ్మకానికి సిద్ధంగా భారీ గణనాథులు

పట్టణానికి చేరుకున్న అతి పెద్ద వినాయకుడు

గత కొన్నేళ్లుగా వికారాబాద్ ఇందిరానగర్ కాలనీలో ఏర్పాటు చేస్తున్న భారీ గణనాథుడు మండపానికి రెండు రోజుల ముందుగానే బుధవారం చేరుకున్నాడు. హైదరాబాద్ నుంచి రూ.1.30 లక్షలతో 18 అడుగుల భారీ గణనాథుడి కాలనీవాసులు తీసుకొచ్చారు. అదే విధంగా ఆయా కాలనీలో నిర్వాహకులు మండపాల ఏర్పాటులో బిజీ బిజీగా గడుపుతున్నారు. ఇన్నాళ్లు వర్షాలు పడాలని ఆశించిన ప్రజలు మండపాలు పూర్తయ్యేవరకు వర్షాలు పడకుంటే బాగుంటుందని ఆశ పడుతున్నారు. అంతేకాకుండా వికారాబాద్ పట్టణంలో వినాయక విగ్రహాల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. స్థానిక చిగుళ్లపల్లి మైదానంతో పాటు రైల్వే స్టేషన్ సమీపంలో వందలాది వినాయక విగ్రహాలను అమ్మకానికి ఉంచారు. రాజస్థాన్ నుంచి వచ్చిన కళాకారులు గత మూడు నెలలుగా తయారుచేసిన విగ్రహాలను రూ.2 వేల నుంచి రూ.30 వేల వరకు అమ్ముతున్నారు. ఈ విగ్రహాలను కొనుగోలు చేయడానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి కాకుండా ఆయా మండలాల నుంచి పెద్ద ఎత్తున వచ్చి కొనుగోలుచేసి తీసుకెళుతున్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

సీపీఎస్ రద్దు చేసేవరకూ పోరాటాలు

కోట్‌పల్లి(బంట్వారం) : సీపీఎస్ విధానాన్ని రద్దు చేసేవరకు పోరాటాలు వివిధ స్థాయిలో కొనసాగిస్తామని సీపీఎస్ సంఘం మండల అధ్యక్షుడు విశ్వేశ్వర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రభుత్వ ఉద్యోగులతో కలిసి సామూహిక సెలవు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీపీఎస్ రద్దు డిమాండ్‌తో సెప్టెంబర్ 1న ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులు సామూహిక సెలవు పెట్టి ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. సీపీఎస్ విధానంతో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల విషయంలో విభజించు పాలించు అనే విధానం అవలంభిస్తుందని ఆన్నారు. ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని సెప్టెంబర్ 1న తలపెట్టిన సామూహిక సెలవులో అందరు భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, అర్చనారెడ్డి, గోపాల్, వెంకట్‌రెడ్డి, సంతోష్‌కుమార్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

బంట్వారంలో...

బంట్వారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పరమేశ్వర్, సుదర్శన్, వెంకటయ్య, కుమార్, బందయ్య, వెంకటేష్, రమేష్, విజయ్‌కుమార్, యాదగిరి, యాదయ్యలు పాల్గొన్నారు.

పోస్టల్ శాఖలో ఖాళీలను భర్తీ చేయాలి

విధులు బహిష్కరించి సమ్మె చేసిన సిబ్బంది

వికారాబాద్ అర్బన్ : పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో నెలకొన్న ఖాళీలను భర్తీ చేయాలని కోరుతూ నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ పిలుపు మేరకు వికారాబాద్ పోస్టాఫీసు సిబ్బంది విధులు బహిష్కరించి ఒక్క రోజు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో ఖాళీగా ఉన్న పోస్టల్ అకౌంటెంట్, జీజీఎస్ పోస్టులు, ఎంఎంఎస్, ఎంజీఎస్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. అదే విధంగా జీడీఎస్ కమిటీ రిపోర్టును అమలుచేయాలన్నారు. పోస్టల్ డిపార్ట్‌మెంట్ ప్రైవేటీకరణపై వెనుక్కు తగ్గాలని వారు డిమాండ్ చేశారు. అదే విధంగా కొత్త పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పోస్టుమాస్టర్ శివకుమార్, సిబ్బంది వినోద్, రమేష్, విఠలేశ్వర్, రవి, శంకర్, ఉమామహేశ్వర్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులు గొప్ప లక్ష్యాలతో ముందుకుసాగాలి

బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేశం



బంట్వారం : విద్యార్థులు గొప్ప లక్ష్యాలతో ముందుకు సాగాలని బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేశం అన్నారు. బుధవారం మండల పరిధిలోని తొర్మామిడిలో లీడ్ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఇప్పటి నుంచి గొప్ప లక్ష్యాలు పెట్టుకుని దేశ అభివృద్ధి కోసం పాటుపడాలన్నారు. సమాజంలో మన పాత్ర ఎలాంటిదో విద్యార్థులు సమాజ సేవలో పాల్గొనాలన్నారు. స్వామి వివేకానంద, డాక్టర్ అబ్దుల్ కలాంలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సావిత్ర, ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్, రమేష్, నవీన్, ఇమ్రాన్, సలీం, జహీర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

'వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి'

ధారూరు : మండలంలో వినాయక ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, అధిక శబ్ధం కాలుష్యం గల డీజేలకు అనుమతులు ఇచ్చేది లేదని ధారూరు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. బుధవారం ధారూరు పోలీస్‌స్టేషన్‌లో ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, యువజన సంఘాలతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినాయక ఉత్సవాల్లో విగ్రహాలను ప్రతిష్ఠించే నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సూచించారు. ప్రార్థన మందిరాలకు దగ్గరగా పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో వినాయక మండపాలను ఏర్పాటు చేయకూడదని ఆయన చెప్పారు. మండపాల వద్ద, నిమజ్జనంలో రెండు లౌడ్ స్పీకర్లను మాత్రమే అనుమతిస్తామని ఆయన చెప్పారు. నిమజ్జనం రోజు సాధ్యమైనంత త్వరగా వినాయకులను ఊరేగించి నిమజ్జనం చేయాలని, బందోబస్తులో ఉన్న పోలీసులకు నిర్వాహకులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధారూరు జడ్పీటీసీ పట్లోళ్ల రాములు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు నాయక్, మండల కోఆప్షన్ సభ్యుడు హాఫీజ్, టీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు భూమోళ్ల కృష్ణయ్య, టీడీపీ, ఎంఐఎం, పార్టీల అధ్యక్షులు మహ్మద్ బాబాఖాన్, మోయిస్‌ఖురేష, వివిధ పార్టీల నాయకులు ఏ.అంజయ్య, మల్లేషంగౌడ్, శివకుమార్, సర్పంచులు, ఎంపీటీసీలు, యువజన సంఘాలు, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులను పూజించాలి

వికారాబాద్ అర్బన్ : వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించాలని శ్రీరామ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు కృష్ణ పంతులు అన్నారు. బుధవారం శ్రీరామ మందిరంలో పాండు సహకారంతో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు ఆడంబరాలకు పోకుండా భక్తి శ్రద్ధలతో స్వామి వారిని పూజించాలన్నారు.

బాగా చదివి మంచి మార్కులు సాధించాలి

ఎమ్మెల్యే సంజీవరావు

మర్పల్లి : భయాందోళనకు గురికాకుండా బాగా చదివి మంచి మార్కులు సాధించాలని కేజీబీవీ విద్యార్థినులకు ఎమ్మెల్యే సంజీవరావు సూచించారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని హారిక కుటుంబానికి ఆయన రూ.3లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నాణ్యమైన భోజనం విద్య అందించాలన్నారు. విద్యార్థుల కదలికల పట్ల ఎప్పటికపుడు గ్రహిస్తూ ఉండాలని విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న అనంతరం ఇంటికి వెళ్లిన విద్యార్థులు తిరిగి విద్యాలయానికి వచ్చేలా వారి తల్లిదండ్రులతో మాట్లాడి తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కొండల్‌రెడ్డి, ఎంపీపీ సుమిత్రమ్మ, జడ్పీటీసీ శోభారాణి, డీసీసీబీ డైరక్టర్ ప్రభాకర్‌గుప్త, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు రామేశ్వర్, మండల పార్టీ అధ్యక్షుడు సురేష్, నాయకులు ఉన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరావు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోట్‌పల్లి(బంట్వారం) : మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని రాంపూర్, ఎన్నారం, అన్నసాగర్, బార్వాద్, కరీంపూర్ గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ నాగశేఖర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాలకు వెళ్లే లైన్ల మెయింట్‌నెన్స్ పనులు ఉండడం వల్ల గురువారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు.

సెప్టెంబర్ 25 వరకు

మిజిల్స్, రుబెల్లా టీకాలు

డాక్టర్ జ్యోతి, వైద్యాధికారి, మోమిన్‌పేట

ఇంటర్వ్యూ



మోమిన్‌పేట : గ్రామాల్లో మూడు దశల్లో ఏడాది నుంచి 15 సంవత్సరాలోపు ఉన్న బాలబాలికలకు మిజిల్స్, రుబెల్లా టీకాలను సెప్టెంబర్ 25 వరకు వేస్తామని మండల వైద్యాధికారి జ్యోతి పేర్కొన్నారు. మండల స్థాయిలో 4వేల మంది విద్యార్థులకు పైగా ఎంఆర్-2 టీకాలను వేశామన్నారు. మొత్తం మండలంలో 11,717 మంది 15సంవత్సరాలోపు బాలబాలికలు ఉన్నట్లు ఆమె వెల్లడించారు.

ప్ర : ఎంఆర్ టీకాలు వేయడం ద్వారా నేటివరకు ఏమైన ఇబ్బందులు ఎదురయ్యాయా ?

జ : మొదటి దశ టీకాల కార్యక్రమంలో అన్ని పాఠశాల స్థాయిలో ఉన్న విద్యార్థులకు ఎంఆర్-2 టీకాలు వేస్తున్నాం.

ప్ర : ఎంఆర్ టీకాలపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. దీనిపై మీ అభిప్రాయం ఏమిటి?

జ : ఎంఆర్-2 టీకాలు విద్యార్థులకు మొదటి రోజు వేస్తున్న సందర్భంలో కొంత మంది తల్లిదండ్రులు ఆందోళన చెందారు. అడిగిన సందేహాలకు అవగాహన కల్పించాం. వైద్య సిబ్బంది ఎప్పటికపుడు సందేహాలను నివృత్తి చేస్తూ టీకాల కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నాం.

ప్ర : మండల స్థాయిలో ఎంతమంది ఎంఆర్ టీకాలకు అర్హులు. నేటివరకు ఎంత మందికి వేసారు ?

జ : ఎంఆర్ టీకాలు వేసుకునేందుకు మొత్తం 11,717మంది బాలబాలికలు మండలంలో ఉన్నారు. నేటి వరకు 4వేలకు పైగా విద్యార్థులకు టీకాలు వేసాం.

'పండగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి'



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

వికారాబాద్ అర్బన్ : ఈ నెలలో జరిగే వినాయక చవితి, బక్రీద్ పండుగలను శాంతియుత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివ్య ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేటులోని తన చాంబర్‌లో వినాయక చవితి, బక్రీద్ పండుగల నిర్వాహణప శాంతి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. పండుగలను సోదర భావంతో జరిగేలా చూడాల్సిన అవసరం మన అందరిపై ఉందని ఆమె అన్నారు. వినాయక మండపాలకు గాను విద్యుత్తు శాఖకు రూ. 500 చెల్లించినట్లయితే విద్యుత్తు కనెక్షన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. దీని వల్ల ప్రమాదాలు నివారించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. విద్యుత్ వైర్లకు కొండీలు వేయడం వల్ల షాట్ సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉంటుందని ఆమె అన్నారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు గణేష్ మంటపాలను నిరంతర విద్యుత్‌ను అందించేందుకు చర్యలు తీసుకోవాలని విద్యుత్తు శాఖ అధికారులను ఆదేశించారు. విగ్రహాలను నిమజ్జనానికి తీసుకువెళ్లేటప్పుడు ఇబ్బంది కలుగకుండా కేబుల్ వైర్లను తీసి వేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఆగస్టు 29న తాండూరులో అదే విధంగా సెప్టెంబర్ 4న వికారాబాద్, పరిగి, కొడంగల్ ప్రాంతాలలో భారీగా నిమజ్జనం జరుగుతుందని అట్టి రోజుల్లో ఉదయం 6 గంటల నుండి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు మద్యం దుకాణాలను మూసి వేయాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. నిమజ్జనానికి అవసరమైన క్రేన్‌లతో పాటు వైద్య సిబ్బందిని కూడా నిమజ్జన ప్రాంతాల్లో అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. సెప్టెంబర్ 2న జరిగే బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తుగానే చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. పండుగను పురస్కరించుకొని గోవులను వధించకుండా చూడాలన్నారు. ఇతర జంతువులను వధించేందుకు ముందస్తుగానే సంబంధిత అధికారుల వద్ద నుండి ధృవీకరణ పత్రాన్ని పొందాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ అన్నపూర్ణ, డీపీఓ మాజీద్, పశు సంవర్ధక శాఖాధికారి సుబ్బారావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ వరప్రసాద్, ఆర్‌అండ్‌బీ ఈఈ బికె ప్రతాప్, విద్యుత్ ఈఈ దుర్గారావు, డీఎస్పీ టి.స్వామి, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్ చిన్న అప్పల నాయుడులతో పాల్గొన్నారు.

బస్సు ఆపాలని రాస్తారోకో



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

తాండూరు : తాండూరు -హైదరాబాద్ రోడ్డు మార్గంలోని హాస్టళ్ల వద్ద ఆర్టీసీ బస్సులను ఆపాలని బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. గంటపాటు జరిగిన రాస్తారోకోలో ఆర్టీసీకి చెందిన బస్సు అద్దాలను ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు యాదగిరి మాట్లాడుతూ బీసీ బాలుర హాస్టల్ విద్యార్థులకు బస్సును ఆపడం లేదని, విద్యార్థుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని పేర్కొన్నారు. హాస్టల్ వద్ద తాండూరు, వికారాబాద్ డిపోకు చెందిన బస్సులను రెక్వెస్ట్ స్టాప్ కింద ఆపాలని డిమాండ్ చేశారు. తాండూరు ఆర్టీసీ డీఎం కృష్ణమూర్తి అక్కడికి చేరుకుని తక్షణమే రిక్వెస్ట్ బస్‌స్టాప్ ఏర్పాటు చేసి బస్సులను ఆపుతామని విద్యార్థులకు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ శ్రీనివాస్, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాల్లోకే ఉపాధి కూలి

- ఉపాధి డబ్బులు బ్యాంకుల ద్వారా చెల్లింపునకు శ్రీకారం
- ఉపాధి కార్డులకు ఆధార్‌తో అనుసంధానం
- పోస్టాఫీస్ చెల్లింపులకు ఇక స్వస్తి



కొడంగల్: ఉపాధిహామీ పథకంలో పని చేసే కూలీల వేతనాలను ఇక నుంచి బ్యాంకు ద్వారా అందించేందుకు ప్రభుత్వం భావిస్తుంది. అందులో భాగంగా ఖాతాలు తీయించాలని అధికారులను ఆదేశించింది. ఫలితంగా ఏళ్లుగా పోస్టాఫిస్‌ల ద్వారా జరిగే బిల్లుల చెల్లింపు విధానానికి స్వస్తి పలకనుంది. ఈ నూతన విధానంతో ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోకుండా నేరుగా త్వరగా కూలీల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని ప్రభుత్వం యోచిస్తుంది.

ఉపాధి కూలీల వివరాల సేకరణ..

ఈ నూతన విధానంలో కూలీల బ్యాంకు ఖాతాలు, ఉపాధిహామీ కార్డు, సెల్ నెంబర్‌లను తీసుకొని వాటిని ఆధార్‌తో అనుసంధానం చేయనున్నారు. గ్రామాల్లో శిబిరాలను ఏర్పాటు చేసి వివరాలన్నీ సేకరించనున్నారు. క్షేత్రసహాయకులకు ఈ పనిని అప్పగించి త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది

నూతన విధానంతో ఆందోళన..

పోస్టాఫిస్‌లలో నగదు కొరత కారణంగా బిల్లులు సకాలంలో అందట్లేదు. కూలీలు రోజు తీరుగుతున్నా ఫలితం లేకపోతుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు పోస్టాఫిస్‌ల ద్వారా చెల్లించాల్సిన మొత్తం రూ.250 కోట్ల పెండింగ్‌లో ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. బ్యాంకుల ద్వారా చెల్లింపులు జరిపితే ఎలాంటి ఇబ్బందులు ఉండవని ప్రభుత్వం భావిస్తుంది. ఈ విధానం మాత్రం కూలీలకు ఇబ్బందులను తెచ్చి పెడుతుందని పలువురు చెబుతున్నారు. సొంత గ్రామాల్లోనే పోస్టాఫిస్‌లు ఉండటంతో ఏ సమయంలోనైనా డబ్బులు తీసుకునే వీలు ఉంటుంది. బ్యాంకుల ద్వారా ఇస్తే కచ్చితంగా మండల కేంద్రాలకు వెళ్లాల్సి ఉంటుంది. దీని కోసం ఓ రోజు కేటాయించాల్సి ఉంటుంది. గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యం లేని పక్షంలో ప్రత్యేకంగా ప్రైవేట్ వాహనాల్లో వెళ్లాల్సి ఉంటుంది. దీంతో అదనపు భారం పడే అవకాశం ఉందని వాపోతున్నారు.

జిల్లాలో ఉపాధి పనులు...

18 మండలాల పరిధిలోని 367 గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కొనసాగుతున్నాయి. శ్రమశక్తి సంఘాలు ఉండగా అందులో 4.266 లక్షల మంది ఉపాధి కూలీ పని చేస్తున్నారు. ప్రస్తుతం హరిత హారం మూడో విడత జోరుగా కొనసాగుతుండటంతో ఉపాధిహామీ అధికారులు ఆ పనిలో నిమగ్నమయ్యారు. ఈ కార్యక్రమం ముగింపు దశకు చేరుకున్న తర్వాత ప్రభుత్వం సూచించిన విధంగా ఉపాధి కూలీల ఆధార్ అనుసంధాన ప్రక్రియను ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు. త్వరలోనే ప్రక్రియ ప్రారంభమై బ్యాంకుల ద్వారా కూలీ డబ్బులు పొందేందుకు సులభతరం కానుంది. కానీ కూలీ పనులు చేసిన గ్రామాల్లో పోస్టాఫిస్‌లు ఉండటంతో కూలీ డబ్బులు పొందేందుకు వెసులుబాటు ఉండేదని పలువురు అభిప్రాయపడగా మరి కొందరూ బ్యాంకుల ద్వారానే సకాలంలో డబ్బులు చేతికి అందుతాయని చెబుతున్నారు. బయోమెట్రిక్ విధానంతో కూలీ డబ్బుల పంపిణీ ఆలస్యం జరగడంతో రోజుల తరబడి తిరగాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

డబ్బులు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలి



ఉపాధి పనులు చేపట్టిన కూలీలకు సకాలంలో డబ్బులు చెల్లించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. పనులు చేపట్టిన పది రోజుల వ్యవధిలోనే కూలీ డబ్బులను చెల్లిస్తే బాగుంటుంది. పలు సాంకేతిక కారణాలతో సకాలంలో కూలీ డబ్బులు అందక ఇబ్బందులు తప్పడం లేదు. బ్యాంకు ద్వారా డబ్బులు చెల్లించడం బాగుంటుంది.

వెంకటయ్య, ఫీల్డ్ అసిస్టెంట్, ఎరన్‌పల్లి

హరితహారం పూర్తయ్యాక కొనసాగిస్తాం..



హరితహారం కార్యక్రమంలో క్షేత్ర సహాయకులు, మిగతా సిబ్బంది నిమగ్నమై ఉన్నారు. కార్యక్రమం పూర్తయిన తర్వాత ఉపాధి కూలీల ఆధార్, బ్యాంకు ఖాతా అనుసంధాన ప్రక్రియను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. బ్యాంకుల ద్వారా చెల్లింపు సులభతరంగా ఉంటుందని ప్రభుత్వం భావిస్తుంది. ప్రభుత్వ ఆదేశాలను త్వరలోనే అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

వీరబ్రహ్మాచారి, ఎంపీడీవో, కొడంగల్

కొండెక్కిన ఉల్లి



పరిగి: ఉల్లి కన్నీళ్లు తెప్పిస్తోంది. ఆకాశన్నంటిన ఉల్లిగడ్డల ధరలతో ప్రజలను చుక్కలను చూపిస్తోంది. ఉల్లి ధర కిలో నిన్నమొన్నటి వరకు రూ.5 నుంచి రూ.10ల వరకు ధరలు ఒక్కసారి అకాశన్నంటడంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని మార్కెట్‌లలో రూ.40 నుంచి రూ.50ల కిలో పలుకుతున్నది. గత రెండు, మూడు రోజుల నుంచి జిల్లాలోని పరిగి,వికారాబాద్, తాండూరు, కొడంగల్ మార్కెట్లలో ఉల్లిధరలు ఉల్లిధరలు రోజు,రోజుకు పెరిగిపోతున్నది. ఇలా ఎడా,పెడా పెరిగిన కూరగాయల ధరలతో శ్రావణ మాసం ఆసాంతం కూరగాయలు కొనలేక కడుపు నిండా తినలేకపోయామని వాపోతున్నారు. కిలో టమాట, మిర్చి రూ.100ల నుంచి ఇప్పుడిప్పుడే ధరలు తగ్గి రూ.50లకు చేరిందని ఆశ పడిన కొనుగోలు దారులకు ఉల్లిగడ్డ ధర పెరిగి పోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కిలో ఉల్లిగడ్డలు కొనుగోలు చేస్తే కనీసం వారం రోజులు వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు. ఇలా అయితే సామాన్యుడు వంటలు చేసుకునేదెలా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిగి మార్కెట్‌లో కిలో ఉల్లి రూ.50లు,పచ్చిమిర్చికి రూ.60 పలికింది. రోజు,రోజకు పెగుతున్న ఉల్లి ధరలను చూసి వ్యాపారస్తులు కూడా కృత్రిమ కొరతను సృష్టిస్తున్నట్లు తెలుస్తోంది. జూన్‌లో కిలో రూ.5 నుంచి రూ.10లలోపే ఉన్న ఉల్లి రెండు నెలల్లోనే ఆరింతలు రెటు పెరిగింది. ఉల్లిని పండించిన రైతులు అమ్ముకున్నప్పుడు క్వింటాలు రూ.500 నుంచి రూ.1000లకే అమ్ముకున్నారు. ఇప్పుడంతా దళారులు,వ్యాపారుల చేతుల్లోకి వెళ్ళిపోయిన తర్వాత క్వింటులకు రూ.4000 నుంచి రూ.5000ల వరకు పలుకుతున్నది. అదే చిల్లర అయితే కిలో రూ.50లకు పైగా చేరుకుంది. వ్యాపారులకు మాత్రం ఉల్లి కాసులపంట పండిస్తున్నది. రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసి ప్రజలకు సరఫరా చేయాల్సిన ప్రభుత్వ వైఫల్యంతో ఉల్లిధరలు తారాస్థాయికి చేరకుంటున్నాయని రైతులు వాపోతున్నారు. ధరలను ప్రభుత్వం నియంత్రించిన కారణంగా సామాన్యుడి జేబు గుల్లవుతోంది. పెరుగుతున్న ధరలను ముందే పసిగట్టిన వ్యాపారులు నిల్వలు ఉంచుకుని కృత్రిమ కొరతలను సృష్టిస్తున్నారు. ఈ కారణంగా మార్కెట్‌లో త్వరంలో కిలో ఉల్లి రూ.100కు చేరుకునే అవకాశాలు ఉంటాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మిగతా వాటి ధరలు పైపైకే..

జిల్లాలోని మార్కెట్లలో ఉల్లితోపాటే కూరగాయల ధరలు కూడా భగ్గుమంటున్నాయి. పెరుగుతున్న కూరగాయల ధరలతో పేద ప్రజలకు భారంగా పరిణమిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.నిత్యం అవసమయ్యే కూరగాయల ధరలు నేడు చుక్కలనట్టడంతో సామాన్య మధ్యతరగతి కుటుంబాలు బావురుమంటున్నాయి. ఏ వస్తువుకైనా నిన్న ఉన్న ధరలు నేడు లేవు..నేటి ధరలు రేపు ఉండకపోవడంతో వారు తీవ్ర అందోళన వ్యక్తం చేస్తున్నారు. ముందేన్నడు లేని విధంగా కూరగాయల ధరలు అసాధారణ రీతిలో పెరగడంతో జీవనం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల క్రితం రూ.40ల కిలో ఉన్న పచ్చిమిర్చి ఇప్పుడు రూ.60 నుంచి రూ.70లకు చేరుకుంది. పరిగి మార్కెట్‌లో గత రెండు వారాల క్రితం కిలో మిరపకాయలు రూ.100లకుపైగా పలికిన సంగతి విధితమే. ప్రస్తుతం కొంత తగ్గిన అది కూడా అది కూడా రూ.60లపైమాటే ఉండడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల క్రితం రూ.30లు ఉన్న బీరకాలు ఇప్పుడు రూ.60లకు చేరుకుంది. బెండకాయ కిలోధర రూ.30 ఉండడా, ఇప్పుడు రూ.40లు, ఆలుగడ్డ రూ.15 ఉంటే ఇప్పుడు రూ.30లు, దొండకాయ రూ.30లు ఉంటే ఇప్పుడు రూ.40లు, వంకాయలు కిలో రూ.30లు రూ.50లకు చేరుకుంది. పరిగి మార్కెట్‌లో ఏ కూరగాయలను చూసిన రూ.50లపైనే ఉంటుంది. దీంతో సామాన్య మధ్య తరగతి వారు కూరగాయలు కొనుగోలు చేయలేక బెంబెలెత్తుతున్నారు. ధరలను నియంత్రించాలని పేద,మధ్య తరగతి కుటుంబాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

పంట రుణం ఇవ్వండి సారూ..

● 30 రోజులుగా బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా బ్యాంకర్లు పట్టించుకోవడం లేదు
● నావల్ల రైతు ఆందోళన



పాసు పుస్తకంతో రైతు వెంకటయ్య

బషీరాబాద్: ఏ బ్యాంకులో కూడా నాకు పంట రుణం ఇవ్వడం లేదు...వ్యవసాయ పాసు పుస్తకాలతో బ్యాంకులకు వెళ్లినా మీ భూమి బ్యాంకు పరిధిలో రాదని చెబుతూ బ్యాంకర్లు నెల పాటు చక్కర్లు కొట్టిస్తున్నారని, విసుగెత్తిన రైతు బషీరాబాద్‌లో విలేకరుల ఎదుట బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. బషీరాబాద్ మండలం నావల్ల గ్రామానికి చెందిన రైతు దామర్‌చెడ్ వెంకటయ్యకు రెడ్డిఘనాపూర్ పంచాయతీ పరిధిలోని అనుబంధ గ్రామం మాసన్‌పలిలో సర్వే నెంబర్ 44లో 4.13 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. దీంతో బ్యాంకు రుణం కోసం ఆన్‌లైన్ పహాణి, పంట పాస్‌పుస్తకం, టైటిల్ డీడ్, నో డ్యూ సర్టిఫికెట్ తీసుకుని బషీరాబాద్ ఎస్‌బీఐ బ్యాంకుకు వెళ్లిల్లాడు. వ్యవసాయం మా పరిధిలోకి రాదని, తాండూరు తెలంగాణ బ్యాంకుకు వెళ్లాలని సూచించారు. దీంతో రైతు తాండూరులోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు కు వెళ్లగా, అక్కడి అధికారులు మా పరిధిలోకి రాదని చెబుతూ కాలయాపన చేస్తున్నారని రైతు వెంకటయ్య ఆందోళన వ్యక్తం చేశారు. ఏడాది కిందట రూ.4లక్షలు ఖర్చు చేసి పెళ్లి చేయగా అప్పులు పెరిగి బ్యాంకు రుణం కోసం వెళితే బ్యాంకు అధికారులు చెప్పులు అరిగేలా తిప్పుతూ రుణం ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని రైతు కంటతడి పెట్టుకున్నాడు. ఉన్నతాధికారులు స్పందిం చి రుణం ఇప్పించాలని ప్రైవేటు అప్పుల బాధతో సతమతమవుతూ మానసిక వేదన అనుభవిస్తున్నానని, రుణం ఇవ్వకపోతే ఆత్మహత్యే శరణ్యమని ఆ రైతు కన్నీటి పర్యంతమయ్యాడు.

న్యాయవాదుల్లో దేశభక్తిని నింపేందుకే

'న్యాయవాది పరిషత్'

● 10న సరూర్‌నగర్‌లో సిల్వర్ జూబ్లీ ముగింపు వేడుకలు
● ముఖ్య అతిథిగా హాజరు కానున్న ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌జీ



వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న న్యాయవాదులు

వికారాబాద్ అర్బన్: న్యాయవాదుల్లో దేశభక్తిని పెంచడంతో పాటు సామాజిక స్పృహను పెంపొందించేందుకు అఖిల భారతీయ అదివక్త పరిషత్ ఆల్ ఇండియా అడ్వకేట్ సంఘం పనిచేస్తుందని ఆ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చౌదరి యాదవరెడ్డి అన్నారు. బుధవారం కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయ ఆవరణలో న్యాయవాది పరిషత్ సిల్వర్ జూబ్లి ముగింపు వేడుకల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. 1992లో ఏర్పడిన ఆల్ ఇండియా న్యాయవాది సంస్థ అయిన అఖిల భారతీయ అదివక్త పరిషత్ సిల్వర్ జూబ్లి వేడుకలను గత నెల ఢిల్లీలో ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ ముగింపు వేడుకలను తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించనున్నారన్నారు. రంగారెడ్డి జిల్లాలోని సరూర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో సెప్టెంబర్ 10న ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి దేశం నలుమూలల నుంచి 6 వేలాది న్యాయవాదులు హాజరవుతారన్నారు. ఇందు కోసం 500 మంది న్యాయవాదులు వాలంటీర్స్‌గా వ్యవహరిస్తారన్నారు. ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను ప్రారంభించడం జరిగిందని, దాని పేరు ఏబీఏపీ25.ఆర్గనైజేషన్ అన్నారు. ఇందులో పూర్తి వివరాలు పొందుపర్చడం జరిగిందని స్పష్టం చేశారు. ఇందులో రిజిస్ట్రేషన్ పేరును నమోదు చేసుకునే సౌలభ్యం కల్పించడం జరిగిందన్నారు. ఈ సంస్థ ప్రధాన లక్ష్యం న్యాయవాద వృత్తిపరమైన నైపుణ్యాలను కల్పించడం జరుగుతుందన్నారు. జాతి పునర్ నిర్మాణంలో భాగస్వామ్యం చేయాలని ఈ సంస్థ పనిచేయడం జరుగుతుందన్నారు. మన తెలుగు రాష్ట్రాల్లో ఈ సంస్థను న్యాయవాది పరిషత్‌గా పిలువడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ శాఖలో యావత్ భారత్ దేశంలోని హై కోర్టు, సుప్రీం కోర్టు శాఖలు జడ్జీలు, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది లవకుమార్, మాధవరెడ్డి, న్యాయవాదులు జనార్ధన్‌రెడ్డి, యాసిన్, మహవీర్ బందయ్య, జగన్, యాదగిరి, ఈశ్వర్‌రెడ్డి, వెంకట్, జయలతరెడ్డి, పార్థసారధి, మల్లయ్య, రాము, వెంకట్, రమేష్ పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రికి మరమ్మతులు

● రూ. 2 కోట్లతో కార్పొరేట్ ఆస్పత్రిలా ఆధునీకరిస్తాం
● డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరుస్తాం
● త్వరలో బ్లడ్ బ్యాంక్ ప్రారంభం ● కలెక్టర్ దివ్య



జిల్లా ఆస్పత్రిలో విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్ దివ్య

తాండూరు: చూడగానే కార్పొరేట్ ఆస్పత్రిలాగా లుక్ వచ్చే విధంగా తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని దాదాపు రూ.2కోట్లతో ఆధునీకరిస్తామన్ని కలెక్టర్ దివ్య దేవరాజన్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రి సూపరింటెంటెండ్, ఇతర శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి మరమ్మతుల కోసం ఇప్పటికే రూ.1కోటి మంజూరయ్యాయని అన్నారు. అయితే వీటితోపాటు వైద్య విధాన పరిషత్ నుంచి రూ.15లక్షలు, కింగ్ కోఠి ఆస్పత్రి నుంచి రూ.80లక్షల ద్వారా జిల్లా ఆస్పత్రి మొత్తాన్ని ఆధునీకరిస్తామని చెప్పారు. ఆస్పత్రిలో ఇప్పటికే డ్రైనేజ్‌ను పలుమార్లు శుభ్రం చేయించినా మళ్లీ వాసన వస్తుందని, ఈ సారి వాసన రాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎలాం టి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఆస్పత్రిలో త్వరలోనే బ్లడ్ బ్యాంకు, డయాలసిలను ప్రారంభిస్తామని అన్నారు. ఆస్పత్రిలోని పలు వార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలో ఎలాంటి పనులు చేపట్టాలో పంచాయతీరాజ్ అధికారులను అంచనా వేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సందీప్ కుమార్, సూపరింటెండెట్ భాగ్యశేఖర్‌గౌడ్, పంచాయతీరాజ్ ఈఈ తదితరులు ఉన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ దివ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల పురాతన భవనాన్ని పరిశీలించారు.

ఆ పనులు మాకొద్దు

● ఉపాధి పనులపై కాంట్రాక్టర్లు అనాసక్తి
● భారమైన ఇసుక, సిమెంట్ ధరలు
● ఇనుము, సిమెంట్‌కు జీఎస్టీ పోటు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

ప్రభుత్వ నిర్మాణ పనులను దక్కించుకునేందుకు ఆరాటపడే కాంట్రాక్టర్లు ఉపాధి హామీ పనులంటే మాకొద్దు బాబోయ్ అని భయపడి పారిపోతున్నారు. లాభం ఏమో కానీ ఖర్చుపెట్టిన డబ్బు చేతికి అందే అవకాశం లేకపోవడంతో ఉపాధి పనులపై ఆసక్తి చూపడం లేదు. దీంతో ఉపాధి హామీ పథకం కింద చేపట్టే నిర్మాణ పనులపై తీవ్ర ప్రభావం పడుతోంది. కొత్త పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఈ పనులు తమకు అసలు గిట్టుబాటు కావడం లేదని చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉండే వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించేందుకు కేంద్రం జాతీయ ఉపాధి హామీ పథకం అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ పథకం కింద గతంలో కేవలం కూలీలకు ఉపాధి కల్పించే వ్యవసాయ పనులు చేపట్టే వారు. అయితే కొన్ని ప్రాంతాల్లో కరువు పరిస్థితులు దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వివిధ పథకాల కింద చేపట్టే నిర్మాణ పనులకూ ఈ పథకాన్ని వర్తింపచేయా లని నిర్ణయించారు. ఈ మేరకు గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, స్కూళ్లు, అంగన్‌వాడీ, సామూహిక భవనాల నిర్మాణాలు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలు ఈ పథకం పరిధి లోకి తెచ్చారు. కేంద్రం కేటాయించే పనులకు మ్యాచింగ్ గ్రాంటు ఉంటే జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఎన్ని పనులైనా చేసుకునే వెసులుబాటు ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం జాతీయ ఉపాధి హామీ పనులు సర్పంచ్‌ల ఆధ్వర్యంలోనే జరగాలి. కాంట్రాక్టర్లను ఎంపికచేసి పంచాయతీ తీర్మానాలు ఆధారంగా పనులు కేటాయిస్తారు. లోపాయికారీగా వీటికి సర్పంచ్‌లు కమీ షన్లు కూడా పుచ్చుకుంటారు. కమీషన్లతో పాటు పెరిగిన నిర్మాణ వ్యయం భరించలేక కాంట్రాక్టర్లు ఈ పనుల జోలికి రావడం లేదు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం జాతీయ ఉపాధి హామీ పనులు సర్పంచ్‌ల ఆధ్వర్యంలోనే జరగాలి. కాంట్రాక్టర్లను ఎంపిక చేసి పంచాయతీ తీర్మానాలు ఆధారంగా పనులు కేటాయి స్తారు. లోపాయికారీగా వీటికి సర్పంచ్‌లు కమీషన్లు పుచ్చుకుంటారు. కమీషన్లతో పాటు పెరిగిన నిర్మాణ వ్యయం భరించలేక కాంట్రాక్టర్లు చేతులెత్తేస్తున్నారు. ఈ పథకం కింద జిల్లాలో ప్రతి ఏటా వందల కోట్ల అభి వృద్ధి పనులు చేపడుతున్నారు. ఇందులో ఈ ఏడాది రూ. 40 కోట్లతో పలు ప్రాంతాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఈ పనులు చేపడుతున్నారు. దాదాపు ఇంతే సమానంగా భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారు. కానీ ఈ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు పలుచోట్ల ముందుకు రావడం లేదు. దీనికి ప్రధానంగా మూడు కారణాలు ఉన్నాయి. జిల్లాలో ఇసుక కొరత అధికంగా ఉంది. ఇసుక ఎక్కడా దొరకడం లేదు. అధిక రేటు చెల్లించి ఇతర ప్రాంతాలనుంచి కొనుగోలు చేయాల్సి వస్తుంది. కాంట్రాక్టర్లకు ప్రభుత్వం ఇసుకకు టన్నుకు రూ. 1000 నుంచి రూ. 1200 వరకే ధర చెల్లిస్తుంది. కానీ ఈ ధరకు ఎక్కడా ఇసుక దొరకడం లేదు. టన్నుకు ఇసును రూ. 1500లకుపైగా చెల్లించి కొనుగోలు చేస్తు న్నామని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. లక్ష రూపాయల ఉపాధి పనులకు మూడువేల రూపాయలు అదనంగా ఖర్చు వస్తుందని చెబుతున్నారు. అలాగే సిమెంట్ విషయంలోనూ కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు. సిమెంట్ బస్తాకు ప్రభుత్వం రూ. 230 చెల్లిస్తోంది. కానీ ఈ ధరకు సిమెంట్ ఎక్కడా దొరకడం లేదు. ప్రస్తుతం సిమెంట్ ధర రూ. 280లపైనే ఉంది. పెరిగిన ఇసుక, సిమెంట్ ధరలకు తోడుగా ఇపుడు జీఎస్టీ భారం కాంట్రాక్టర్లను వేధిస్తోంది. సిమెంట్, స్టీల్, ఇతర నిర్మాణ సామాగ్రి కొనుగోళ్లపై 18శాతం జీఎస్టీ భారం పడుతుం దని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ప్రభుత్వ పనులకు జీఎస్టీ మినహాయించాలని వారు కోరుతున్నారు.

బిల్లుల చెల్లింపులో ఆలస్యం...

ఇదిలా ఉంటే ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా సక్రమంగా చెల్లించడం లేదు. గత మార్చి నెల నుంచి బిల్లులు రాలేదని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. లాభాలు లేకున్నా అనేకచోట్ల ఈ పనులు చేపట్టా మనీ, కానీ వీటికీ బిల్లులు ఇవ్వకపోవడంతో ఇబ్బం దులు పడుతున్నామని వాపోతున్నారు. ఈ కారణంగా అనేక చోట్ల పనులు ముందుకు సాగడం లేదు. కొందరైతే బాధలు పడలేక ఈ పనుల నుంచి ఎప్పుడు బయట పడదామా? అని ఎదురుచూస్తున్నారు. ఉపాధి పనులు చేపట్టే కాంట్రాక్టర్లకు పని పూర్తిచేసినా బిల్లులు పూర్తి గా చెల్లించరు. సోషల్ అడిట్ పూర్తయితేనే బిల్లు మొత్తం చెల్లిస్తారు. సోషల్ ఆడిట్ పూర్తయ్యే వరకు అయిదు శాతం బిల్లులు చెల్లించకుండా ఆపుతారు. సోషల్ ఆడిట్ పూర్తయ్యేందుకు ఏడాదికిపైగా పడు తోంది. అప్పటివరకు కంట్రాక్టర్లు డబ్బు కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. సాధారణంగా పంచాయతీరాజ్ చేపట్టే పనులకు అంచనా విలువ లెక్కించి దాని మీద కాంట్రాక్టర్‌కు 12.5 శాతం లాభం ఉండేలా ఎస్టిమేట్ తయారుచేస్తారు. కానీ గ్రామీణాభివృద్ధి పనుల్లో లాభాలు లేకుండానే ఎస్టిమేట్లు తయారుచేయాలి. నిర్మాణ వ్యయం పెరగడంతోపాటు సర్పంచ్‌లకు కొంత కమీషన్ల రూపం లో చెల్లించుకోవాల్సి ఉండడంతో కాంట్రాక్టర్లకు పెట్టిన పెట్టుబడి కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదు.

నూతన పెన్షన్ విధానంపై 28న ఆందోళన

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్)

దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యాయుల సం యుక్త కార్యాచరణ సమితి (జాక్టో) ఏర్పాటు కావటం సంతోషకరమని జాక్టో స్టీరింగ్ కమిటీ సభ్యులు ప్రవీణ్ కుమార్, పరమేశ, వెంకట్‌రెడ్డి, చేవెళ్ల స్వామి, బషీర్, అనీల్, శ్రీనివాస్, భాస్కర్, నరేందర్ అంజయ్య, వినోద్, సురేష్, అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 28న జాక్టో ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నూతన పెన్షన్ విధానానికి వ్యతిరేకంగా ఉపాధ్యాయులంతా నిరసన తెలియజేయనున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయులు సామూహికంగా సెలువు పెట్టి ధర్నాకు హాజరు కావాలని వారు కోరారు.

విద్యార్థులకు దుస్తులు, క్రీడాసామగ్రి పంపిణీ



తాండూరు రూరల్: వాసవిక్లబ్ ఇంటర్ నేషనల్ తాండూరు శాఖ ఆధ్వర్యంలో బుధవారం జినుగుర్తిలో క్లబ్ కార్యదర్శి శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా విద్యార్థినీలకు దుస్తులు, పుస్తకాలు, క్రీడా సామాగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జీ భవానీ, వాసవి క్లబ్ అధ్యక్షుడు రొంపల్లి సంతోష్, కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి గుబ్బ నరేష్, సభ్యులు మేడిశెట్టి శ్రీనివాస్, వెంకటేష్, ప్రమోద్, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మించినా..బస్సు సౌకర్యం కరువు

యాలాల: కాక్రవేణి నదిపై వంతెన నిర్మాణం పూర్తయితే మండల కేంద్రానికి బస్సు సౌకర్యం కలుగుతుందనుకున్న పది గ్రామాల ప్రజలకు నిరాశే ఎదురైంది. వంతెన నిర్మించి దశాబ్దాలు గడుస్తున్నా మండల కేంద్రానికి మాత్రం బస్సు సౌకర్యాన్ని కల్పించలేదు. దీంతో వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వెళ్లాల్సిన పది గ్రామాల రైతులు మూడు కిలో మీటర్ల దూరం మేరకు కాలి నడకన వెళ్లాల్సి వస్తుంది. మండల పరిధిలోని విశ్వనాథ్‌పూర్ గ్రామ సమీపంలో కాక్రవేణి నదిపై 2002లో ప్రపంచ బ్యాంకు నిధులతో వంతెన నిర్మాణాన్ని చేపట్టారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే మండల పరిధిలోని రాస్నం, పగిడ్యాల్, ముద్దాయిపేట్, అచ్చుతాపూర్, భాగాయిపల్లి, అన్నసాగర్, అడాల్‌పూర్, బాణాపూర్, నాగసముందర్, కమాల్‌పూర్, రాఘవాపూర్ గ్రామాల ప్రజలకు కేవలం 10 కిలోమీటర్ల దూరంలోనే యాలాల మండల కేంద్రం అవుతుంది. అప్పట్లో ఈ గ్రామ ప్రజలకు అనుకూలంగా మండల కేంద్రానికి వెళ్లేందుకు బస్సు సౌకర్యం కల్పిస్తామని అక్కడికి వెళ్లిన సమావేశంలో నాయకులు హామీనిచ్చారు. కాని నేటి వరకు కూడా బస్సు సౌకర్యాన్ని కల్పించలేదు. దీంతో ఈ గ్రామాల ప్రజలు 20కిలోమీటర్ల దూరంలో గల తాండూరుకు వచ్చి అటు నుంచి యాలాలకు 12 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుంది. దీంతో బస్సు చార్జీలు అదనం కావడంతో పాటు దూరభారంతో సమయం వృధా అవుతుందని ప్రయాణికులు వాపోతున్నారు. రాస్నం నుంచి విశ్వనాథ్‌పూర్ మీదుగా యాలాలకు బస్సు సౌకర్యాన్ని కల్పిస్తే కేవలం పది కిలోమీటర్ల దూరంతోపాటు బస్ చార్జీలు తగ్గి సమయం కూడా ఆదా అవుతుందని పలువురు పేర్కొన్నారు. విశ్వనాథ్‌పూర్ మీదుగా మండల కేంద్రానికి ప్రభుత్వ కార్యాలయాల సమయానికి అనుకూలంగా బస్సు సౌకర్యం కల్పించాలని పలు మార్లు గ్రామస్థులు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాండూరు నుంచి ఎమ్మెల్యేగా గెలిచి రవాణా శాఖ మంత్రిగా ఉన్న మహేందర్‌రెడ్డి స్పందించి రాస్నం నుంచి విశ్వనాథ్‌పూర్ మీదుగా యాలాలకు బస్సు సౌకర్యం కల్పించాలని పలువురు కోరుతున్నారు.



విశ్వనాథ్‌పూర్ గ్రామ సమీపంలో కాక్రవేణి నదిపై నిర్మించిన వంతెన

మట్టి వినాయకుల పంపిణీ



మట్టి వినాయకులు, మొక్కలను పంపిణీ చేస్తున్న విజయలక్ష్మి

తాండూరు: పట్టణంలోని 28వ వార్డులో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కోట్రిక విజయలక్ష్మీ బుధవారం ఇంటింటికి తిరిగి ఉచితంగా మట్టి వినాయకులను, మొక్కలు, చేతి బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ప్రతినిధి శ్రీదేవి, పట్టణ బీజేపీ అధ్యక్షుడు బంట్వార భద్రేశ్వర్, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కోట్రిక శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా తాండూరు ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం మట్టివినాయకులను ఉచితంగా పంపిణీ చేశారు. గాంధీచౌక్ వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాంచంద్రుడు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సిద్ధన్న, కార్యదర్శి ఆకారం శివకుమార్, యువజన సంఘం అధ్యక్షుడు కోట్రిక శ్రీకాంత్, ప్రతినిధులు తర్లపల్లి భాను పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- డీఎస్పీ రాంచంద్రుడు



డిజిటల్ ఐడీ కార్డులను డ్రైవర్లకు అందజేస్తున్న డీఎస్పీ

తాండూరు: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ఆటోలో అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ రాంచంద్రుడు అన్నారు. బుధవారం తాండూరు భవానీ ఫంక్షన్ హాల్‌లో "మన పోలీస్-మన కోసం" కార్యక్రమంలో భాగంగా పాల్గొని ప్రసంగిస్తూ ఓవర్ లోడ్ ప్యాసింజర్లతో ఆటోలు నడిపితే డ్రైవర్లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సీఐ ప్రతాపలింగం మాట్లాడు తూ ఆటోలు స్పీడ్‌లో నడిపిస్తున్నారని, అలాంటి ఆటోలో కోర్టులో డిపాజిట్ చేస్తామని తెలిపారు. ఆటోలో సౌండ్ సిస్టం తొలగించాలని అన్నారు. పట్టణంలో ఏవైనా సంఘటనలు జరిగినా ఆటో డ్రైవర్లు తక్షణమే పోలీసులకు సమాచారం అందిస్తే వారికి ప్రోత్సాహకం అందిస్తామని తెలిపారు. లైసెన్సులు లేకుండా ఆటోలు నడపరాదని సూచించారు. డిజిటల్ ఐడీ కార్డు కంపెనీ ప్రతినిధి సందీప్ మాట్లాడుతూ ఆటోల పూర్తి వివరాలు, సాఫ్ట్‌వేర్‌లో పొందుపరిచామని తెలిపారు. ఐడీ కార్డులో లైసెన్సు వివరాలు, బ్లడ్ గ్రూప్, ఓనర్, డ్రైవర్ వివరాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సునితాసంపత్, కౌన్సిలర్ పట్లోళ్ల నర్సింహులు, ఎస్ఐ నాగార్జున తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆటో డ్రైవర్లకు డిజిటల్ ఐడీ కార్డులను డీఎస్పీ అందజేశారు.

కేంద్ర మంత్రుల రాకతో మెరుగుపడిన రోడ్లు

తాండూరు రూరల్: మండలం జినుగుర్తి సమీపంలోని వెలసిన ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన డిప్లొమా కోర్సు కళాశాలను కేంద్ర మంత్రులు ప్రారంభించనున్నారు. మంత్రుల రాకతో జినుగుర్తి మెయిన్ గేటు నుంచి ఫౌండేషన్ వరకు సుమారు 4కిలోమీటర్ల మేరకు గుంతలు పడిన రోడ్డును ఆర్అండ్‌బీ అధికారులు దగ్గరుండి పనులు చేయిస్తున్నారు. బుధవారం ఆర్అండ్‌బీ ఏఈ రాజారాం రోడ్డుపై పడిన గుంతల్లో నాపరాతి ముక్కలు వేయించి వాటిపై మొర్రం చల్లించి చదును చేయించారు. గ్రామస్తులు, వివిధ ప్రాంతాల ప్రయాణికులు నిత్యం ఈ రోడ్డు మార్గంపై ప్రయాణించాలంటేనే జంకేవారు. రోడ్డు బాగు చేయాలని పలుమార్లు ప్రజా ప్రతినిధులు, నేతలు ధర్నా చేపట్టినా కనికరించని అధికారులు కేంద్రమంత్రి రాకతో రోడ్డు బాగు చేయడం పట్ల చూపుతున్న శ్రద్ధ గతంలో ఎందుకు కనిపించలేదని గ్రామస్తులు ఏఈ రాజారాంను నిలదీశారు.

వాణికి ఎక్సలెన్స్ అవార్డు



రోశయ్య చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కళాకారులు

తాండూరు: మైత్రి ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో తాండూరుకు చెందిన వాణికి ఎక్సలెన్స్ అవార్డు 2017ను రవీంద్రభారతిలో తమిళనాడు మాజీ గవర్నర్ రోశయ్య అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా 171 మంది కళాకారులు ఈ అవార్డును అందుకున్నారు.

'గని కార్మికుల జోలికి వస్తే బతుకు పోరాటం చేస్తాం'

- నాపరాళ్ల గనుల మూసివేతతో రోడ్డున పడ్డ వేలాది గని కార్మికులు
- మంత్రి మహేందర్‌రెడ్డి జోక్యం చేసుకుని న్యాయం చేయాలి
- కాంగ్రెస్ నాయకులు ఎం.నరేష్

బషీరాబాద్: కొన్నేళ్లుగా తవ్వి వదిలేసిన నాపరాళ్ల గనుల్లో రాళ్లను తవ్వుకుని ఉపాధి పొందుతున్న గని కార్మికుల ఉపాధిపై దెబ్బకొట్టి పేదలను రోడ్డున పడేయడమేనా బంగారు తెలంగాణ లక్ష్యమంటూ కాంగ్రెస్ నాయకులు, మాజీ మంత్రి స్వర్గీయ చంద్రశేఖర్ కుమారుడు ఎం.నరేష్ ఆందోళన వ్యక్తం చేశారు. బషీరాబాద్‌లోని తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. నాలుగు రోజుల క్రితం ఎక్మాయి శివారులో గుట్టపై అక్రమ తవ్వకాలు జరుపుకుంటున్నారంటూ సబ్ కలెక్టర్, రెవెన్యూ యంత్రాంగం దాడులు జరిపిన విషయంపై ఆందోళన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని ఎక్మాయి, కొర్విచెడ్, నావల్గ, క్యాద్గీర, మాసన్‌పల్లి, తదితర గ్రామాల్లో నాపరాళ్ల గనులు ఉన్నా తవ్వి వదిలేసినవే ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ గనుల్లో పనిచేసిన కార్మికులకు వేరొక పని తెలియక పొట్ట కూటి కోసం తవ్విన చోట ఎక్కడో కొంత నాపరాళ్ల నిక్షేపాలుంటే తవ్వుకుని కొన్ని కుటుంబాలు జీవనం సాగిస్తున్నారన్నారు. గని కార్మికులు ఉన్న కాస్త గని ప్రాంతానికి లీజు తీసుకుందామన్నా ఎన్‌వోసీ పేరిట రెవెన్యూ అధికారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇదేది పట్టించుకోకుండా కార్మికుల ఉపాధిపై దెబ్బ కొట్టడం ఏమిటంటూ ప్రశ్నించారు. గతంలో సబ్ కలెక్టర్ అలుగు వర్షిణి గని ప్రాంతాలను పరిశీలించి నాపరాళ్ల నిక్షేపాలు లేవని స్వయంగా గుర్తించారంటూ ఆయన చెప్పారు. పనికిరాని గనుల్లో కొందరు కార్మికులు మిషన్‌లతో తవ్వకాలు జరిపి కుటుంబాలను పోషించుకుంటున్నారని, వారికి పని కల్పించి ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. గని కార్మికుల పట్ల మంత్రి మహేందర్‌రెడ్డి స్పందించి న్యాయం చేయాలని, లేదంటే గని కార్మికులకు అండగా బతుకు పోరాటం చేసి పేదలకు ఉపాధి మార్గం కల్పిస్తామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ అధికార ప్రచార కార్యదర్శి రాజరత్నం, మాజీ ఎంపీటీసీ శివప్రసాద్, సాయిల్‌గౌడ్, మునీందర్‌రెడ్డి, మైనారిటీ నాయకులు మునీర్, మస్తాన్, మాజీ సర్పంచ్ జీవన్గి రాములు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు నరేష్

కరణం పురుషోత్తంరావు జన్మదిన వేడుకలు

యాలాల: మాజీ ఎంపీపీ, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కరణం పురుషోత్తంరావు జన్మదిన వేడుకలను బుధవారం ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ సాయన్నగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ సిద్రాల శ్రీనివాస్, టీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి సురేందర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్ల ట్రేలో పురుగులు



గుడ్డు ట్రేలో పురుగులు

బషీరాబాద్: అంగన్‌వాడీ కేంద్రం లో సరఫరా చేసే కోడి గుడ్ల ట్రేలో పురుగులు బయట పడుతున్నాయి. మండలంలోని మల్కన్‌గిరిలోని ఓ బాలింతకు గుడ్లను పంపిణీ చేయగా, కోడిగుడ్ల ట్రేలో పురుగులు బుధవారం బయటపడ్డాయి. ఇది చూసిన బాలింత కుటుంబీకులు గుడ్లను తీసుకెళ్లి బయట పడేశారు. అనంతరం 1098 చైల్డ్‌లైన్ ప్రధాన కార్యాలయానికి ఫోన్‌చేసి ఫిర్యాదు చేశారు. స్థానిక ప్రతినిధి హన్మంత్‌రెడ్డిని అప్రమత్తం చేసిన ప్రధాన కార్యాలయం అధికారులు విచారణ జరిపించారు. బాలింతకు వేరే గుడ్లు ఇస్తామని సీడీపీవో చెప్పినట్లు వారు వివరించారు.

సకల కళా కోవిదుడు.. డీవీవీఎస్



తాను రచించిన స్నేహమేరా జీవితం పుస్తకావిష్కరణలో (ఫైల్)

కవిగా.. గాయకుడిగా.. ఉపాధ్యాయుడిగా.. వ్యాఖ్యాతగా.. పలువురు ప్రముఖులచే ప్రశంసలు, సన్మానాలు

షాద్‌నగర్‌టౌన్: ఒక మనిషి ఒకే కళలో ఆరితేరి ఉంటే అతన్ని కళాకారుడు అంటారు. ఒకే మనిషి సకల కళల్లో నైపుణ్యం ప్రదర్శిస్తే అతన్ని సకల కళా కోవిధుడు అంటారు. ఈ కోవకు చెందిన వారే షాద్‌నగర్ పట్టణానికి చెందిన డీవీవీఎస్ నారాయణ (దీక్షితుల వీర వేంకట సత్యానారాయణ). ప్రముఖ కవి, రచయిత, గాయకుడు, వ్యాఖ్యాతగా తనదైన శైలిలో పలువురిని అలరిస్తూనే ఉపాధ్యాయుడిగా కొనసాగి ప్రస్తుతం ఎంతో మంది ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు తాను స్వయంగా రచించిన స్టడీ మెటీరియల్స్‌ను దాతల సహకారంతో ఉచితంగా అందిస్తూ సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా తనదైన ముద్ర వేసుకుంటున్నారు డీవీవీఎస్ నారాయణ. ఇప్పటి వరకు తెలుగు రాష్ట్రాల్లోని పలు పట్టణాల్లో 1074 వేదికల ద్వారా పలు రకాల ప్రదర్శనలిచ్చి పలువురు ప్రముఖులచే శభాష్ అనిపించుకున్నారు.

తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన స్వర్గీయ సూర్యప్రకాశ శాస్త్రి, రుక్మిణి దంపతుల కుమారుడైన నారాయణ బీ.కాం, బీ.ఏ, ఎం.ఏ బీఎడ్ పూర్తి చేసి 1979లో పాలమూరు జిల్లాకు తరలి వచ్చి షాద్‌నగర్, పెబ్బేర్, వనపర్తి, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో పలు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఆంగ్లోపన్యాసకునిగా పనిచేశారు.



ప్రముఖ సినీ గాయని ఎస్ జానకితో నారాయణ (ఫైల్)

చిన్నతనం నుంచి పాటలంటే ఎంతో మక్కువ గల నారాయణ పలు వేదికలపై ఘంటసాల, ఎస్పీ బాలసుబ్రమణ్యం పాడిన పాటలు పాడి అలరించారు. అలాగే రచనలు చేయడమంటే ఎంతో ఇష్టమైన నారాయణ యండమూరి వీరేంద్రనాథ్‌ను స్ఫూర్తిగా తీసుకుని నేటివరకు పలు కథనాలు, కవితలు, నవలలు, వ్యాసాలు, సినీ గీతాల సంకలనాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల కోసం పలు సబ్జెక్టులకు సంబంధించి స్టడీ మెటీరియల్స్‌ను స్వయంగా రచించారు. నారాయణ రాసిన కవితలు, వ్యాసాలు ఆంధ్రజ్యోతి, బాలజ్యోతి, ఆంధ్రభూమి, నవ్య, బాలమిత్ర తదితర పుస్తకాల్లో ప్రచురితమయ్యాయి. తాను మొట్టమొదటగా రచించిన స..రి..గ..మ...కథ 1987లో ఆంధ్రజ్యోతి వీక్లీలో ప్రచురితం కావడం విశేషం. అంతే కాకుండా పిల్లల కథలు, తెలుగు-ఆంగ్ల వ్యాకరణాలు, పోటీ పరీక్షల పుస్తకాలను రచించిన నారాయణ పట్టణానికి చెందిన ప్రముఖులు బండారి రమేష్, పాతూరి వెంకట్రావు, చెందిమహేందర్‌రెడ్డిలతో పాటు అమెరికాలో ఉండే తన స్నేహితులైన తిలక్‌ల ఆర్థిక సహకారంతో విద్యార్థులకు ఉచితంగా అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా 8 లక్షల పుస్తకాలను పేద విద్యార్థులకు అందించాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. అంతే కాకుండా ఆలిండియా రేడియో, సప్తగిరి టీవీ, హెచ్‌ఎం టీవీ, మహా టీవీ ఛానళ్లలో నారాయణ సంభాషణలు, కథానికలు ప్రసారమయ్యాయి.

అవార్డులు- సత్కారాలు...

సకల కళల్లో ఆరితేరిన నారాయణ పలు ప్రాంతాల్లో ప్రముఖ కవి డాక్టర్ సి. నారాయణరెడ్డి, ప్రముఖ నటుడు అక్కినేని నాగేశ్వర్ రావు, ప్రముఖ గాయకులైన ఎస్పీ బాలసుబ్రమణ్యం, ఎస్. జానకి, రామకృష్ణ, ఆనంద్, ప్రముఖ వ్యాపారవేత్త డాక్టర్ టి. సుబ్బరామిరెడ్డి, అప్పటి పాలమూరు జిల్లా కలెక్టర్ అనంతరాం, అప్పటి మంత్రి చిన్నారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డితో పాటు పలు స్వచ్ఛంద సంస్థల నుంచి పలు రకాల సన్మానాలు, సత్కారాలు అందుకున్నారు.



తాను రచించిన గీతాల సంకలనాన్ని డాక్టర్ సి. నారాయణరెడ్డికి అందిస్తున్న డీవీవీఎస్ (ఫైల్)



ప్రముఖ సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యంతో ..(ఫైల్)



అప్పటి పాలమూరు జిల్లా కలెక్టర్ అనంతరాం చేతుల మీదుగా షీల్డ్‌ను అందుకుంటున్న నారాయణ (ఫైల్)

కళలను పరిరక్షించడమే ధ్యేయం
డీవీవీఎస్ నారాయణ



నేను నేర్చుకున్న పలు రకాల కళలను పరిరక్షించడంతో పాటు ఉత్సాహవంతులైన యువకులకు తర్ఫీదుని వ్వాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాను. ప్రాచీన కళలు కనుమరుగవుతున్న ప్రస్తుత తరుణంలో వాటి పరిరక్షణ బాధ్యతను ప్రభుత్వం చేపట్టాలి. పేద విద్యార్థుల కోసం నేను పలు రకాల వ్యాకరణం, పోటీ పరీక్షలు, స్టడీ మెటీరియల్స్‌ను రచించాను. వాటిని దాతల ఆర్థిక సహకారంతో రాష్ట్రంలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో ఉచితంగా అందిస్తున్నాను.

పత్తిపైరుపై వింత పురుగుల దాడి

కాయలను తొలిచేస్తున్న వైనం

బెంబేలెత్తుతున్న రైతులు

పైరును పరిశోధిస్తున్న వ్యవసాయాధికారులు

కేశంపేట: అసలే వర్షాభావం... ఇప్పటికే ఎండిపోయిన మొక్కజొన్న... చెదురుమదురు జల్లులతో కాస్త ఆశాజనకంగా ఉన్న పత్తిపైరుపై వింత పురుగు దాడి చేస్తుండడంతో రైతన్నలు బెంబేలెత్తుతున్నారు. ఎప్పుడూ చూడని పురుగులు కాయలను తొలిచి మొత్తం తినేస్తుందని ఆవేదనకు లోనవుతున్నారు. ఈ సారి కూడా నష్టాలు చవిచూడాల్సి వస్తుందేమోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేశంపేట మండలంలో వాణిజ్య పంటగా 18,798 ఎకరాల్లో పత్తిని సాగుచేశారు. అయితే పత్తి పైరుపై వింత పురుగులు దాడిచేసి కాయలను తొలిచివేస్తున్నాయి. ఒక్కరోజులోనే కాయను మొత్తం తినేసి నాశనం చేస్తున్నాయి. కాయలపై గుంపులుగా చేరి కాయను తొలిచి లోనికివెళ్లి మొత్తం గుజ్జును తినేస్తున్నాయి. అంతేకాకుండా పూత, గూడపై కూడా వీటి ప్రభావం పడుతుంది. ఉదయం, సాయంత్రం సమయాల్లో పైర్లపై వింత పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటున్నది. పురుగులకు రెక్కలు ఉండడంతో రైతులు చేనులోకి వెళ్లే సమయంలో ఎగిరిపోతున్నాయి. ఎవరూ లేని సమయంలో తిరిగి కాయలపై వాలి తినేస్తున్నాయి. పురుగుల ఉధృతిని నివారించకపోతే మరిన్ని పైర్లపై దాడిచేసే అవకాశం ఉంది. కేశంపేట మండల వ్యవసాయాధికారి క్షేత్రస్థాయిలో పత్తి పైర్లను పరిశీలిస్తున్నారు. పత్తి పైర్లకు ఆశించిన వింత పురుగులను సేకరించి ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు వారు వివరించారు. తక్షణమే వాటి నివారణ కోసం క్లోరోపైరిపాస్ 50ఈసీ 400 మి.లీ, డైక్లోరోపాస్ 200మి.లీ ఎకరాకు పైపాటిగా పిచికారీ చేయాలని అధికారులు సూచిస్తున్నారు. వింతపురుగులపై పూర్తి సమాచారం వచ్చిన తర్వాత నివారణ చర్యల గురించి వివరిస్తామని వ్యవసాయాధికారులు తెలుపుతున్నారు.



పైరును పరిశీలిస్తున్న రైతులు



కాయను తొలిచి తింటున్న పురుగులు



కాయను తొలుస్తున్న వింత పురుగులు

కాయలను నాశనం చేస్తున్నాయి

బిక్కి, బాల్యాతండా



పత్తిపైర్లలో వింత పురుగులు తిరుగుతున్నాయి. అవి కాయలపై వాలి తినేస్తున్నాయి. కాయల లోపలికి వెళ్లి గుజ్జును కూడా తింటున్నాయి. కౌలుకు తీసుకొని పత్తిపైరు పండిస్తున్నా కనీసం కౌలు చెల్లించే డబ్బులు కూడా వచ్చేలా లేవు. అధికారులు మందులను ఇవ్వాలి.

పురుగులు విజృంభిస్తే పంట నాశనమే

శేఖర్‌రెడ్డి, రైతు, తొమ్మిదిరేకుల



వింత పురుగులు పత్తిపైరుపై ఆశించి నష్టం చేస్తున్నాయి. మా గ్రామానికి చెందిన ఠాగూర్ నాయక్ పత్తిపైరులో ఈ వింత పురుగులు విజృంభిస్తున్నాయి. అవి ఇతరుల పైర్లపై ఆశిస్తే నష్టం జరుగుతుంది. వ్యవసాయ అధికారులు వింత పురుగుల నివారణకు సరైన సూచనలు, సలహాలు అందించాలి.

సస్యరక్షణతో పురుగుల నివారణ

గోపాల్‌నాయక్, ఏవో, కేశంపేట



తొమ్మిదిరేకుల, లింగంధన గ్రామాల్లో వింత రెక్కల పురుగులు పత్తి చేలపై ఆశిస్తున్నట్లు గుర్తించాం. అయితే రైతులు వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. పైర్లపై క్లోరోపైరిపాస్ 50ఈసీ 400 మి.లీ, డైక్లోరోపాస్ 200మి.లీ ఎకరాకు పైపాటిగా పిచికారీ చేయాలి.

‘బల్గేరియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ-2017’విజేత?


ఎస్.మహిపాల్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

1. 2017కి గాను ‘మాలతి చందూర్’ సాహిత్య పురస్కారానికి ఎంపికైనది?
ఎ) రంగనాయకమ్మ బి) కనపర్తి వరలక్ష్మి
సి) శివరాజు సుబ్బలక్ష్మి
డి) యద్దనపూడి సులోచనరాణి

2. కమ్యూనికేషన్ రంగంలో విశిష్ఠ సేవలందించినందుకు ‘మార్కోని సొసైటీ జీవన సాఫల్య పురస్కారం-2017’కి ఎంపికైన ఇండో అమెరికన్?
ఎ) థామస్ కైలత్ బి) శంకర్ సుబ్రమణ్యం
సి) వెంకట్రామన్ రామకృష్ణన్
డి) పురుషోత్తందాస్ మహర్

3. ఎకనమిక్స్ ఇంటెలిజెన్స్ యూనిట్ 140 దేశాలపై నిర్వహించిన సర్వేలో 2017కిగాను అత్యంత నివాసయోగ్య నగరంగా తొలిస్థానంలో నిలిచింది?
ఎ) వాంకోవర్(కెనడా) బి) గ్జిమాసున్(చైనా)
సి) వియన్నా(ఆస్ట్రియా) డి) మెల్‌బోర్న్(ఆస్ట్రేలియా)

4. షాంఘై ర్యాంకింగ్ కన్సల్టెన్సీ 2017కిగాను ప్రకటించిన ‘అకడమిక్ ర్యాంకింగ్స్ ఆఫ్ వరల్డ్ యూనివర్సిటీ’ నివేదికలో తొలిస్థానం పొందింది?
ఎ) హార్వర్డ్ యూనివర్సిటీ(అమెరికా)
బి) సింగువా యూనివర్సిటీ(చైనా)
సి) మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (అమెరికా)
డి) టోక్యో యూనివర్సిటీ(జపాన్)

5. 2017 ఆగస్టు 17న రక్షణ శాఖ రూ.4168 కోట్లతో ఆరు అపాచీ హెలికాప్టర్ల కొనుగోలుకు ఆమోదం తెలిపింది. వీటి తయారీ సంస్థ బోయింగ్ ఏ దేశానికి చెందింది?
ఎ) ఇటలీ బి) జర్మనీ సి) అమెరికా డి) ఫ్రాన్స్

6. ‘బల్గేరియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ-2017’ పురుషుల సింగల్స్ విజేత?
ఎ) పీటర్ గ్రేడ్(డెన్మార్క్) బి) లక్ష్యసేన్(ఇండియా)
సి) లిన్‌డాన్(చైనా)
డి) జ్వొనిమిర్ డుర్కిన్‌జాక్(క్రొయేషియా)

7. ఫోర్బ్స్ పత్రిక-2017కిగాను ప్రకటించిన అత్యధిక రెమ్యూనరేషన్ పొందుతున్న హీరోయిన్ల జాబితాలో తొలిస్థానం పొందింది?
ఎ) జెన్నిఫర్ లోపెజ్ బి) జెన్నిఫర్ అనిస్టోన్
సి) అలిసియ వికెందర్ డి) ఎమ్మాస్టోన్

8. ఇండియాటుడే ఇటీవల భారత ప్రధానుల సమర్థతపై ‘మూడ్ ఆఫ్ ద నేషన్’ పేరిట నిర్వహించిన సర్వేలో 33 శాతం ఓట్లతో అత్యంత సమర్థుడైన ప్రధానిగా నిలిచింది?
ఎ) అటల్ బిహారి వాజ్‌పేయి
బి) జవహర్‌లాల్ నెహ్రూ
సి) ఇందిరాగాంధీ డి) నరేంద్రమోదీ

9. మదర్సాల ఆన్‌లైన్ నమోదుకు ఇటీవల ప్రత్యేక పోర్టల్‌ను ప్రారంభించిన రాష్ట్రం?
ఎ) గుజరాత్ బి) ఉత్తరప్రదేశ్
సి) బిహార్ డి) కేరళ

10. ఇన్ఫోసిస్ ఎం.డి. విశాల్‌సిక్కా రాజీనామాతో తాత్కాలిక ఎం.డి.గా ఎవరు నియమితులయ్యారు?
ఎ) ప్రవీణ్‌రావు బి) సంజయ్ బంగా
సి) సబీర్ భాటియా
డి) విజయ్ శేఖర్ శర్మ

11. తెలంగాణలో తొలి స్మార్ట్ పోలీస్‌స్టేషన్‌ను 2017 ఆగస్టు 18న ఎక్కడ ప్రారంభించారు?
ఎ) జమ్మికుంట(కరీంనగర్) బి) బెజ్జంకి(సిద్ధిపేట)
సి) నవిపేట(నిజామాబాద్)
డి) దోమకొండ(నిజామాబాద్)

12. 2017 ఆగస్టు 19న మహిళ భద్రత కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన టోల్‌ఫ్రీ నంబరు?
ఎ) 181 బి) 1551 సి) 112 డి) 999

జి.కె. అండ్ కరెంట్ అఫైర్స్

13. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ అందించే ‘వ్యవసాయ నాయకత్వ అవార్డు-2017’కి ఎంపికైనది?
ఎ) శివరాజ్‌సింగ్ చౌహాన్(మధ్యప్రదేశ్)
బి) నితిష్ కుమార్(బీహార్)
సి) కె.చంద్రశేఖర్‌రావు(తెలంగాణ)
డి) విజయన్(కేరళ)

14. 2017కి గాను ఫోర్బ్స్ పత్రిక ప్రకటించిన అత్యధిక ఆదాయం గల మహిళ క్రీడాకారుల జాబితాలో తొలిస్థానం పొందింది?
ఎ) సెరెనా విలియమ్స్(టెన్నిస్)
బి) మరియ మజుచిక్(చెస్)
సి) పి.వి.సింధు(బ్యాడ్మింటన్)
డి) స్మృతి మందన(క్రికెట్)

15. ‘ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్- 2017’కి ఆతిథ్యమిస్తున్న నగరం?
ఎ) కౌలాలంపూర్(మలేషియా)
బి) గ్లాస్గో(బ్రిటన్) సి) బ్యాంకాక్(థాయ్‌లాండ్)
డి) హంగ్జే(చైనా)

16. ఎవరి జయంతిని పురస్కరించుకొని ఆగస్టు 20ని ‘సద్భావన దివస్’గా నిర్వహిస్తారు?
ఎ) రవీంద్రనాథ్ ఠాగూర్ బి) రాజీవ్‌గాంధీ
సి) ఇందిరాగాంధీ డి) పండిట్ రవిశంకర్

17. భారత నౌకా దళానికి చెందిన ఆరుగురు మహిళ అధికారులు ప్రపంచ యాత్ర లక్ష్యంగా చేపట్టిన ‘నావికా సాగర్ పరిక్రమ’ ప్రాజెక్టులో ఉపయోగిస్తున్న నౌక?
ఎ) ఐఎన్ఎస్‌వి తరిణి
బి) ఐఎన్ఎస్‌వి మహదేవి
సి) ఐఎన్ఎస్‌వి సింధురక్షక్
డి) ఐఎన్ఎస్‌వి తలాష్

18. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతనంగా విడుదల చేయనున్న రూ.50 నోటుపై ఉన్న చిహ్నం ‘సాంస్కృతిక రథాన్ని’ ఎక్కడి నుంచి గ్రహించారు?
ఎ) జైపూర్(రాజస్థాన్) బి) హంపి(కర్ణాటక)
సి) శ్రావణబెళగొళ(కర్ణాటక) డి) పింప్రి(మహారాష్ట్ర)

19. ‘నికోలాయ్ కుద్‌షెవ్’ ఇటీవల ఏ దేశం తరపున భారత్‌లో రాయబారిగా నియమితులయ్యారు?
ఎ) రష్యా బి) మంగోలియా
సి) కజకిస్థాన్ డి) ఇజ్రాయెల్

20. భారత్‌లో పాకిస్థాన్ నూతన హైకమిషనర్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?
ఎ) అబ్దుల్ బాసిత్ బి) మలీహాలోధి
సి) సొహెల్ మహమ్మద్ డి) రియాల్ షరీఫ్

21. పి.ఆర్.శేషాద్రి ఇటీవల ఏ బ్యాంక్‌కు మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు?
ఎ) కెనరా బ్యాంక్ బి) లక్ష్మివిలాస్ బ్యాంక్
సి) బ్యాంక్ ఆఫ్ బరోడా డి) కరూర్ వైశ్యా బ్యాంక్

22. 2017కిగాను ‘స్పానిష్ సూపర్ కప్’ ఫుట్‌బాల్ టోర్నీ విజేత?
ఎ) రియల్ మాడ్రిడ్ క్లబ్ బి) బార్సిలోనా క్లబ్
సి) ఇంగ్లీష్ ప్రిమీయర్ క్లబ్ డి) రివర్స్ ప్లెటో క్లబ్

23. 2017 ఆగస్టులో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏ దేశాన్ని ‘పోలియో రహిత దేశం’గా ప్రకటించింది?
ఎ) సెనెగల్ బి) కాంగో
సి) సోమాలియా డి) పాకిస్థాన్

24. ‘అండర్-19 ప్రపంచ కప్ క్రికెట్ టోర్నీ-2018’కి ఆతిథ్యం ఇస్తున్న దేశం?
ఎ) ఆస్ట్రేలియా బి) న్యూజిలాండ్
సి) ఇండియా డి) శ్రీలంక

25. భారత వ్యవసాయ శాఖ 2016-17కి గాను విడుదల చేసిన గణాంకాల ప్రకారం దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి(మిలియన్ టన్నుల్లో)
ఎ) 110.15 బి) 384.76 సి) 314.16 డి) 275.68

26. భారత్ ఏ దేశంతో కుదుర్చుకొన్న మేధోహక్కుల పరస్పర అవగాహన ఒప్పందాన్ని కేంద్ర కేబినెట్ ఇటీవల ఆమోదించింది?
ఎ) ఆస్ట్రియా బి) స్వీడన్ సి) ఫ్రాన్స్ డి) అమెరికా

27. హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ నూతన చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్?
ఎ) సంతోష్‌శర్మ బి) మన్నెల్లి లక్ష్మీకాంతం
సి) సంజయ్‌గుప్తా డి) హర్షకుమార్ భన్వాల్

28. ఇటీవల విడుదలైన ‘ఇండియా ఎట్ 70; స్నాప్ షాట్ సిన్స్ ఇండిపెండెన్స్’ పుస్తక రచయిత?
ఎ) ఎన్.సి.ఉల్లేఖ్ బి) రోషెన్ దలాల్
సి) అమృతా వర్గీస్ డి) అరుంధతిరాయ్

29. మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ‘నమో యువ రోజ్‌గార్ కేంద్ర’ ప్రధాన ఉద్దేశం?
ఎ) యువ పారిశ్రామికవేత్తలకు రుణసౌకర్యం
బి) ఆర్గానిక్ కూరగాయలను తక్కువ ధరకు ప్రజలకు చేరువ చేయడం
సి) యువజన సంఘాల ఏర్పాటు ద్వారా ఐక్యత పెంపొందించడం
డి) రాష్ట్ర నిర్మాణంలో యువత నైపుణ్యాల వినియోగం

30. 2017 ఆగస్టు 18న దోమలను నిరోధించే ప్రత్యేక రైలును ప్రవేశపెట్టిన నగరం?
ఎ) ఢిల్లీ బి) బెంగళూరు
సి) చెన్నై డి) కోయంబత్తూర్

31. కేంద్రమంత్రి స్మృతి ఇరాని ప్రారంభించిన చేనేత ఉత్పత్తి, ఎగుమతి సంస్థ ‘ఒరియంట్ క్రాఫ్ట్ లిమిటెడ్’ ఏ రాష్ట్రానికి చెందింది?
ఎ) చత్తీస్‌గఢ్ బి) జార్ఖండ్ సి) మధ్యప్రదేశ్ డి) కేరళ

32. ‘ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్’ 2017 ఆగస్టులో ప్రకటించిన వన్డే ర్యాంకింగ్స్‌లో తొలిస్థానం పొందిన బ్యాట్స్‌మన్?
ఎ) కేన్ విలియమ్సన్ బి) షకిబుల్ హసన్
సి) విరాట్ కోహ్లి డి) ఎవరూ కాదు

33. శ్రీలంక నేవీ చీఫ్‌గా నియమితులైన తమిళ సంతతి వ్యక్తి?
ఎ) కదిరగమర్. ఆర్ బి) డబ్ల్యూ.హెచ్.పెరెర
సి) పెరియార్ మురుగన్ డి) ట్రావిస్ సిన్నిహ్

34. ఎదగకుండా జన్మించిన శిశువుల పరిరక్షణ కోసం కృత్రిమ గర్భసంచిని రూపొందించింది?
ఎ) యూనివర్సిటీ ఆఫ్ వెస్టర్న్ ఆస్ట్రేలియా
బి) మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, అమెరికా
సి) టోక్యో యూనివర్సిటీ, జపాన్ డి) ఎ, సి

35. స్కూల్ టీచర్ల కోసం ‘మేఘశాల’ అనే మొబైల్ యాప్‌ను ప్రారంభించిన రాష్ట్రం?
ఎ) రాజస్థాన్ బి) తమిళనాడు
సి) కర్ణాటక డి) హర్యాన

క్రీడా పురస్కారాలు

36. 2017కిగాను ‘రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న, అర్జున’ అవార్డుల ఎంపిక కమిటీ చైర్మన్?
ఎ) ఎస్.కె.శర్మ బి) సి.కె.ధక్కర్
సి) మేరికోం డి) కరణం మల్లీశ్వరి

37. 2017కిగాను ‘ధ్యాన్‌చంద్, ద్రోణాచార్య’ అవార్డుల ఎంపిక కమిటీ చైర్మన్?
ఎ) మేరికోం బి) కరణం మల్లీశ్వరి
సి) అభినవ్ బింద్రా డి) పుల్లెల గోపిచంద్

38. 2017కిగాను ‘రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న’కి ఎంపికైన పారా అథ్లెట్ దేవేంద్ర ఝఝూరియ ఏ క్రీడకు చెందిన వ్యక్తి?
ఎ) హైజంప్ బి) టెన్నిస్
సి) జావెలిన్ త్రో డి) షాట్‌పుట్

39. దేవేంద్రతోపాటు 2017కిగాను ‘ఖేల్‌రత్న’ పొందిన మరో క్రీడాకారుడు?
ఎ) ఎస్.ఎస్.పి.చౌరాసియా - గోల్ఫ్
బి) సర్దార్‌సింగ్ - హాకీ
సి) జ్యోతిసురేఖ - షూటింగ్
డి) విరాట్ కోహ్లి - క్రికెట్

40. 2017కిగాను ‘ధ్యాన్‌చంద్’ అవార్డుకి ఎంపికైన ముగ్గురిలో లేనిది?
ఎ) సత్తిగీత - అథ్లెటిక్స్
బి) భూపేందర్‌సింగ్ - అథ్లెటిక్స్
సి) సయ్యద్ షాహిద్ హకీం - ఫుట్‌బాల్
డి) సుమరయి టెటె - హాకీ

41. 2017కిగాను ‘ద్రోణాచార్య’ అవార్డుకి ఎంపికైన ఏడుగురిలో మరణానంతరం పొందిన వ్యక్తి?
ఎ) హీరానంద్ కటారియా - కబడ్డీ
బి) బ్రిజ్‌భూషణ్ మహంతి - బాక్సింగ్
సి) పి.ఎ.రాఫెల్ - హాకీ
డి) డాక్టర్ ఆర్.గాంధీ - అథ్లెటిక్స్

42. 2017కిగాను ‘అర్జున’ అవార్డు పొందిన 17 మందిలో సరైన వారిని గుర్తించండి?
1. ప్రశాంతసింగ్ - బాస్కెట్ బాల్
2. చటేశ్వర్ పుజారా - క్రికెట్
3. ఎస్.వి. సునీల్ - హాకీ
4. మరియప్పన్ తంగవేలు - పారా అథ్లెట్
5. వరుణ్ సింగ్ బాటి - పారా అథ్లెట్
6. సాక్షి మాలిక్ - రెజ్లింగ్
ఎ) అన్నీ సరైనవే
బి) 6 మినహా అన్నీ సరైనవే
సి) 1, 2, 4 సరైనవి డి) 2 మాత్రమే సరైనది

సమాధానాలు

1) సి	7) డి	13) సి
2) ఎ	8) డి	14) ఎ
3) డి	9) బి	15) బి
4) ఎ	10) ఎ	16) బి
5) సి	11) ఎ	17) ఎ
6) బి	12) ఎ	18) బి

19) ఎ	27) ఎ	35) సి
20) సి	28) బి	36) బి
21) డి	29) బి	37) డి
22) ఎ	30) ఎ	38) సి
23) సి	31) బి	39) బి
24) బి	32) సి	40) ఎ
25) డి	33) డి	41) డి
26) బి	34) డి	42) బి

JOBS ఉద్యోగాలు

బిసిపిఎల్

గెయిల్ ఇండియా లిమిటెడ్, ఆయిల్ ఇండియా లిమిటెడ్, న్యూమలీఘర్ రిఫైనరీ లిమిటెడ్, అసోం ప్రభుత్వం ఉమ్మడిగా నిర్వహిస్తున్న బ్రహ్మపుత్ర క్రాకర్ & పాలిమర్ లిమిటెడ్ (బిసిపిఎల్)- కింది పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 14

పోస్టులు - ఖాళీలు: సీనియర్ మేనేజర్(హెచ్ఆర్)2, మేనేజర్(కెమికల్ 2, ఎఫ్& ఎ 1), డిప్యూటీ మేనేజర్(కెమికల్ 2, హెచ్ఆర్ 1), సీనియర్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్ 1, ఇన్‌స్ట్రుమెంటేషన్ 1, మెకానికల్ 1), సీనియర్ ఆఫీసర్(లా 1, మార్కెటింగ్ 2)

అర్హత: పోస్టును అనుసరించి 50 శాతం మార్కులతో డిగ్రీ/ ఎంబిఏ/(పీజీ/ పీజీ డిప్లొమా)(పర్సనల్ మేనేజ్‌మెంట్/ పర్సనల్ మేనేజ్‌మెంట్& ఇండస్ట్రియల్ రిలేషన్స్)/ ఎల్ఎల్‌బి/ ఎల్ఎల్ఎం / బిటెక్(కెమికల్/ పెట్రో కెమికల్/ కెమికల్ టెక్నాలజీ/ పెట్రో కెమికల్ టెక్నాలజీ/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్/ ఇన్‌స్ట్రుమెంటేషన్/ ఇన్‌స్ట్రుమెంటేషన్ & కంట్రోల్/ ఎలక్ట్రానిక్స్ & ఇన్‌స్ట్రుమెంటేషన్/ మెకానికల్/ ప్రొడక్షన్/ ప్రొడక్షన్ & ఇండస్ట్రియల్/మాన్యుఫ్యాక్చరింగ్/ మెకానికల్ & ఆటోమొబైల్)/ సీఏ/ ఐసిడబ్ల్యుఏఐ ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: పోస్టును అనుసరించి 30 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి.

దరఖాస్తు ఫీజు: రూ.200

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 21

వెబ్‌సైట్: www.bcplonline.co.in

ఎన్‌బిసిసి

ఎన్‌బిసిసి ఇండియా లిమిటెడ్ - కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

మొత్తం ఖాళీలు: 94

పోస్టులు - ఖాళీలు: జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) 1, అడిషనల్ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) 2, డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) 6, ప్రాజెక్ట్ మేనేజర్ (సివిల్) 5, డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ (సివిల్ 10, ఎలక్ట్రికల్ 5), డిప్యూటీ మేనేజర్(లా) 2, అసిస్టెంట్ మేనేజర్(లా 2), సీనియర్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్(సివిల్ 10, ఎలక్ట్రికల్ 3), అసిస్టెంట్ మేనేజర్(హెచ్ఆర్ఎం 2, రాజ భాష 2), జూనియర్ ఇంజనీర్(సివిల్ 40, ఎలక్ట్రికల్ 4)

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 26

వెబ్‌సైట్: www.nbccindia.com

సుభాష్ చంద్రబోస్‌ను 'నేతాజీ' అని తొలిసారి పిలిచింది?

ఆధునిక భారతదేశ చరిత్ర



ఎస్. రాజా చక్రధర్
సీనియర్ ఫ్యాకల్టీ

1. 'నాకు రక్తమివ్వండి. మీకు స్వాతంత్ర్యం ఇస్తాను' అని ప్రకటించిన జాతీయోద్యమ నేత?
   ఎ) భగత్‌సింగ్ బి) చంద్రశేఖర్ అజాద్
   సి) సుభాష్ చంద్రబోస్ డి) ఖుదీరాంబోస్
2. 1897 జనవరి 23న సుభాష్ చంద్రబోస్ జన్మించిన ప్రాంతం?
   ఎ) కలకత్తా బి) కాన్పూర్ సి) ఢాకా డి) కటక్
3. సుభాష్ చంద్రబోస్ జన్మించిన భవనం నేడు చారిత్రక ప్రాధాన్యత పొందింది. దాని పేరు?
   ఎ) ప్రగతి భవన్ బి) జానకీనాథ్ భవన్
   సి) జననీ భవన్ డి) జాగృతి భవన్
4. ఐసిఎస్ ఉద్యోగాన్ని వదులుకొని సుభాష్ చంద్రబోస్ జాతీయోద్యమంలోకి ప్రవేశించిన సంవత్సరం?
   ఎ) 1919 బి) 1920 సి) 1921 డి) 1922
5. సుభాష్ చంద్రబోస్ వ్యక్తిత్వంపై ప్రభావం చూసిన జాతీయోద్యమ నేత?
   ఎ) మోతీలాల్ నెహ్రూ బి) చిత్తరంజన్ దాస్
   సి) బిపిన్ చంద్రపాల్ డి) గాంధీజీ
6. గాంధీజీని జాతిపితగా అభివర్ణించిన జాతీయ నాయకుడు?
   ఎ) గోపాలకృష్ణ గోఖలే బి) రవీంద్రనాథ్ ఠాగూర్
   సి) సిఆర్.దాస్ డి) సుభాష్ చంద్రబోస్
7. సుభాష్ చంద్రబోస్ ఏ ఉద్యమం ద్వారా జాతీయోద్యమంలో ప్రవేశించారు?
   ఎ) చంపారన్ సత్యాగ్రహం
   బి) ఖిలాఫత్ ఉద్యమం
   సి) సహాయనిరాకరణ ఉద్యమం
   డి) ఉప్పు సత్యాగ్రహం
8. గాంధీజీ ఏ ఉద్యమంలో చేపట్టిన సుదీర్ఘ పాదయాత్రను సుభాష్ చంద్రబోస్ నెపోలియన్స్ ఎల్బాదీవి నుంచి చేపట్టిన యాత్రతో పోల్చారు?
   ఎ) సహాయనిరాకరణ ఉద్యమం
   బి) ఉప్పు సత్యాగ్రహం సి) వ్యక్తి సత్యాగ్రహం
   డి) క్విట్ ఇండియా ఉద్యమం
9. సుభాష్ చంద్రబోస్‌ను 'నేతాజీ' అని తొలిసారి పిలిచింది?
   ఎ) గాంధీజీ బి) నెహ్రూ
   సి) సి.ఆర్.దాస్ డి) బిపిన్ చంద్రపాల్
10. ఏ జాతీయ కాంగ్రెస్ సమావేశానికి అధ్యక్షుడిగా బోస్ 1938లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు?
    ఎ) కలకత్తా బి) లక్నో
    సి) బొంబాయి డి) హరిపురి
11. ప్రణాళిక సంఘాన్ని స్థాపించి, భారతదేశాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని సూచించింది?
    ఎ) గాంధీజీ
    బి) మోక్షగుండం విశ్వేశ్వరయ్య
    సి) సుభాష్ చంద్రబోస్
    డి) నెహ్రూ
12. గాంధీజీ బలపర్చిన భోగరాజు పట్టాభి సీతారామయ్యను బోస్ ఏ కాంగ్రెస్ సమావేశంలో ఓడించారు?
    ఎ) త్రిపురి బి) హరిపురి
    సి) కలకత్తా డి) లక్నో
13. సుభాష్ చంద్రబోస్ 'ఫార్వర్డ్ బ్లాక్' రాజకీయ పార్టీని ఎప్పుడు స్థాపించారు?
    ఎ) 1937 బి) 1938 సి) 1939 డి) 1940



14. ఆంగ్లేయులను దేశం నుంచి తరిమికొట్టేందుకు బోస్ గృహనిర్బంధం నుంచి తప్పించుకొని భారత్‌ను వదిలిన సంవత్సరం?
    ఎ) 1939 బి) 1940 సి) 1941 డి) 1942
15. కాబూల్, మాస్కో మీదుగా బోస్ ఏ నగరానికి చేరుకొన్నాడు?
    ఎ) బెర్లిన్ బి) పారిస్ సి) లిస్బన్ డి) జెనీవా
16. సుభాష్ చంద్రబోస్ ఏ దేశంలోని రేడియో కేంద్రం ద్వారా భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు?
    ఎ) రష్యా బి) ఫ్రాన్స్ సి) జర్మనీ డి) జపాన్
17. భారతదేశ స్వాతంత్ర్య పోరాటానికి సాయం చేస్తామని బోస్‌కు హామీ ఇచ్చిన దేశం?
    ఎ) జర్మనీ బి) జపాన్ సి) రష్యా డి) ఏదీకాదు
18. టోక్యోలో సుభాష్ చంద్రబోస్‌తో చర్చలు జరిపిన 'టోజో' ఏ పదవిలో ఉన్నారు?
    ఎ) జపాన్ అధ్యక్షుడు బి) ప్రధాన మంత్రి
    సి) సైన్యాధికారి డి) విదేశాంగ మంత్రి
